ANN తెలుగు

Follow: @ANNTELUGU

14-01-2025

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 44 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

## సంక్రాంతి వేళ మోదీ గుడ్ న్యూస్

- ఇందూరుకు పసుపుబోర్డు
- చైర్మన్‌గా పల్లె గంగారెడ్డి నియామకం
- హర్షం వ్యక్తం చేసిన ఎంపీ ధర్మపురి అర్వింద్



02

## కౌశిక్ రెడ్డి అరెస్ట్ దుర్మార్గం

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారు
- ఖండించిన కేటీఆర్



02

## రేషన్ కార్డుల జారీకి మార్గదర్శకాలు

- సంక్రాంతి వేళ సీఎం రేవంత్ గుడ్ న్యూస్
- 26 నుండి కార్డులు మంజూరు



02

## సంక్రాంతి శుభాకాంక్షలు

పండుగ పొద్దులు మంచుతో తడిశాయి
భోగి మంటలతో వీధులు మెరిశాయి

చుట్టాల హడావిడితో లోగిళ్ళు
అంట్లతో అగచాట్ల ఇల్లాళ్ళు

పతంగుల గొడవే పిల్లగాండ్లకు
మాంజా సేకరణే ఆశయాలు

ముంగిళ్ళ ముగ్గులతో ముగ్దలు
గొబ్బెమ్మలతో నిండుగా లోగిళ్ళులు

**మహా పత్రిక పాఠకులకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు**

**సంక్రాంతి పండుగ కారణంగా ఆఫీసుకు సెలవు.. రేపు (బుధవారం) పత్రిక వెలువడదు**



# పాడి అరెస్ట్

### ఎమ్మెల్యే సంజయ్‌పై దాడి కేసులో కీలక పరిణామం

- స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన జగిత్యాల ఎమ్మెల్యే
- కాసేపటికే అరెస్ట్.. ఐదు కేసులు నమోదు
- కౌశిక్ రెడ్డి సభ్యత్వం రద్దుకు అవకాశాల పరిశీలన

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి సోమవారం రాత్రి అరెస్టయ్యారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై కరీంనగర్ కలెక్టరేట్‌లో దురుసుగా ప్రవర్తించడంపై ప్రభుత్వం తమ కాంగ్రెస్ వర్గాలు తీవ్ర ఆగ్రహంగా వున్నాయి. స్పీకర్‌కు జగిత్యాల ఎమ్మెల్యే ఫిర్యాదు చేయగా కాసేపటికే కౌశిక్‌ను అరెస్ట్ చేశారు. మరోవైపు కౌశిక్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం బిగ్ షాక్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్ లో జరిగిన సంఘటనపై పోలీసులు రౌడీ షీట్ ఓపెన్ చేయనున్నట్లు తెలుస్తోంది. కౌశిక్ సభ్యత్వం రద్దుకు అవకాశముందా? ఎమ్మెల్యేలు హద్దుమీరి ప్రవర్తిస్తున్న సందర్భాలలో ఇతర రాష్ట్రాల్లో ఎలాంటి చర్యలు తీసుకున్నారనేదానిపై ప్రభుత్వవర్గాలు కసరత్తు చేస్తున్నాయి.

గాడిదకు కౌశిక్ రెడ్డి ఫొటో 02

## పెట్టుబడులకు గమ్య స్థానంగా తెలంగాణ



- పరిశ్రమల శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- గతంలో వచ్చిన పెట్టుబడుల స్థితిపై ఆరా
- 18 ఒప్పందాల్లో.. 17 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని అధికారుల వివరణ
- ఈనెల 16 నుండి 22 వరకు పర్యటన

02



# మోడీ చిరు సంభాషణ

### కిషన్ రెడ్డి ఇంట్లో అదిరిపోయేలా సంక్రాంతి సంబరాలు

మెగాస్టార్‌ను ఆత్మీయంగా పలకరించిన ప్రధాని

సంబరాలకు హాజరైన కేంద్ర మంత్రులు, తెలుగు నేతలు

**ఢిల్లీ మహా :** తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. రంగురంగుల రంగవల్లులతో గ్రామాలు, పట్టణాలు ముస్తాబు కాగా.. కోడి పందేలు, ఎడ్ల పందేలతో పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఇంట్లో సంక్రాంతి సంబరాలు హోరెత్తిపోతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలోని ఆయన నివాసంలో సోమవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు పలువురు కేంద్ర మంత్రులు, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. కాగా, మెగాస్టార్ చిరంజీవి , ఎంపీలు లక్ష్మణ్, అనురాగ్ ఠాకూర్, ఈటెల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు, లక్ష్మణ్, గోడెం నగేష్, బాలశౌరి, కొండ విశ్వేశ్వర్ రెడ్డి , డి.కె.అరుణ సహా పలువురు తెలంగాణ బీజేపీ నేతలు సైతం వేడుకలో పాల్గొన్నారు. అలాగే లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, జ్యోతి రాధిత్య సింధియా, మనోహర్ లాల్ కట్టర్, పెమ్మసాని చంద్రశేఖర్, బండి సంజయ్, సతీశ్ చంద్ర దూబే, శ్రీనివాస్ వర్మ హాజరయ్యారు. మరోవైపు పలువురు ఎంపీలు, పారిశ్రామికవేత్తలు, బీజేపీ నేతలు కిషన్ రెడ్డి నివాసానికి భారీగా చేరుకున్నారు. కేంద్ర మంత్రి నివాసానికి చేరుకున్న ప్రధాని మోదీకి కిషన్ రెడ్డి, చిరంజీవి, పెమ్మసాని చంద్రశేఖర్ సాదర స్వాగతం పలికారు. సంక్రాంతి వేడుకల నేపథ్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా కిషన్ రెడ్డి ఇంటిని ముస్తాబు చేశారు.



# గాడిదకు కౌశిక్ రెడ్డి ఫోటో

## ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అనుచరుల నిరసన

### కౌశిక్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్



**జగిత్యాల, మహా:** కరీంనగర్ సమావేశంలో సంజయ్‌పై కౌశిక్ రెడ్డి దాడి చేయడంపై సంజయ్ అనుచరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కౌశిక్ రెడ్డికి వ్యతిరేకంగా వినూత్నంగా నిరసనకు దిగారు. కరీంనగర్ సమావేశంలో సంజయ్‌పై కౌశిక్ రెడ్డి అనుచిత ప్రవర్తను నిరసనగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఫోటోను గాడిదకు కట్టి ఊరేగించారు ఎమ్మెల్యే సంజయ్ అనుచరులు. పాడి కౌశిక్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై ఎమ్మెల్యే సంజయ్ ఫిర్యాదు చేశారు. తనపై దురుసుగా ప్రవర్తించాడని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. తన హక్కులకు భంగం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేస్తే నేనూ చేస్తా

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్

### బీఆర్ఎస్ హయాంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నారని విమర్శ

### కౌశిక్ రెడ్డి వీధి రౌడీలా ప్రవర్తించాడు



**కరీంనగర్, మహా :** బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలను చేర్చుకున్నారని, అందుకుగాను కేసీఆర్, కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని, ఆ తర్వాత వారు తమ పదవులకు రాజీనామా చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. అప్పుడే తానూ తన పదవికి రాజీనామా చేస్తానన్నారు. తనను రాజీనామా చేయాలని కోరుతున్న కౌశిక్ రెడ్డి ముందు కేసీఆర్, కేటీఆర్‌లను కోరాలన్నారు. జిల్లా సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వీధి రౌడీలా ప్రవర్తించారని సంజయ్ విమర్శించారు. కౌశిక్ రెడ్డి స్వతహాగా చేశారా? ఎవరైనా రెచ్చగొడితే చేశారా? అనేది తెలియాలన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. నివేదిక తెప్పించుకొని చర్యలు తీసుకుంటారని భావిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీ పిరాయింపులను ప్రోత్సహించినపుడు కౌశిక్ రెడ్డి అదే పార్టీలో ఉన్నారని, అప్పుడెందుకు వారిని నిలదీయలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేస్తే సరైంది, ఇతరులు చేస్తే తప్పు అని ఎలా అంటారని ప్రశ్నించారు. కౌశిక్ రెడ్డి వెనుక బీఆర్ఎస్ నేతలున్నారన్న అనుమానాలున్నా.న్నారు. తనను నేరుగా ఎదురించే దమ్ములేక కౌశిక్ రెడ్డిని తనపై ఉసిగొల్పారని మండిపడ్డారు. నియోజకవర్గ అబివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్నానని, దీన్ని బీఆర్ఎస్ జీర్ణించుకోలేక పోతుందని విరుచుకుపడ్డారు. కేసీఆర్, కేటీఆర్ లు నియంతల్లా వ్యవహరిస్తున్నారని, వారి నియంతృత్వం నుంచి బయటపడ్డందుకు తనపై కక్షకట్టి దాడులకు ప్రోత్సహిస్తున్నారని దుయ్యబట్టారు. తనపై దాడికి పాల్పడ్డ కౌశిక్ రెడ్డిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని భావిస్తున్నానని సంజయ్ కుమార్ అన్నారు. తనపై జరిగిన దాడికి కౌశిక్ రెడ్డి మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

# కౌశిక్ రెడ్డి అరెస్ట్ దుర్మార్గం

## ఖండించిన కేటీఆర్

**హైదరాబాద్, మహా:** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని అక్రమంగా అరెస్టుచేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పూటకో అక్రమ కేసు పెట్టడం.. రోజుకో బీఆర్ఎస్ నేతను అన్యాయంగా అరెస్టుచేయడం రేవంత్ సర్కారుకు ఓ అలవాటుగా మారింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి దిగజారుడు పనులకు దిగుతున్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేను వెనకేసుకొచ్చి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని ఏకపక్షంగా అరెస్టుచేయడం పూర్తిగా అప్రజాస్వామికం. హుజూరాబాద్ నియోజకవర్గంలో రైతురుణమాఫీని ఎగ్గొట్టి, దళితబంధుకు పాతరేసిన కాంగ్రెస్ సర్కారును ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేకే రేవంత్ ఈ అణచివేత చర్యలకు దిగుతున్నారు. అక్రమంగా అరెస్టు చేసిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని'' అన్నారు.

# రోడ్డు ప్రమాదాలలో సెల్ ఫోన్ డ్రైవింగ్ కేసులే ఎక్కువ

## సీట్ బెల్ట్, హెల్మట్ ధరించిన కేసులు తర్వాతి వరుసలో..

### జాగ్రత్తలు తప్పనిసరంటున్న నిపుణులు



**హైదరాబాద్,మహా :** సెల్ ఫోన్ నడుపుతూ వాహనాలను డ్రైవింగ్ చేయడం ద్వారా ప్రమాదాలు అదికమవుతున్నాయి. తాజాగా పోలీసు శాఖ విడుదల చేసిన ప్రమాదాల గణాంకాలను పరిశీలిస్తే గతేడాది సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు దాదాపు 1.68 లక్షలు నమోదయ్యాయి. ఇలా సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసేవారు, సిగ్నళ్లు జంప్ చేసే చోదకులు వారితో పాటు ఆ వాహనాల్లో ఉన్నవారి ప్రాణాలకు రోడ్డుపై వెళ్లే అతర ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు తెస్తున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. నిబంధనలు పాటిస్తూ నడిపితే మన సమయాన్ని ఆదా చేసే వాహనాలు, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విలువైన ప్రాణాల్ని హరిస్తున్నాయన్న విషయం స్పష్టమవుతోంది. రాష్ట్రంలో వాహనదారులు నిబంధనలు పాటించక పోతుండడంతో ప్రతిరోజు 21 మంది రోడ్డు ప్రమాదాల్లో బలవుతున్నారని, 65 మంది ఘాయాలపాలవుతున్నారని నివేదికలు వెల్లడించాయి. 2024లో జనవరి నుంచి అక్టోబరు వరకు రాష్ట్రవ్యాప్తంగా 6,329 మంది రోడ్డు ప్రమాదంలో మరణించగా 19,642 మంది గాయపడ్డారని నివేదికలు వెల్లడిస్తున్నాయి. నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి అక్టోబరు నెలాఖరు వరకు పది నెలల్లో అధికారులు పెట్టిన కేసులు 1.18 కోట్లు. జాతీయ, రాష్ట్ర రహదారుల్లో ప్రమాదాల సంఖ్య అధికంగా ఉంటోంది. 1.18 కోట్ల కేసుల్లో 79లక్షలు హెల్మెట్ ధరించని వారిపైనే ఉన్నాయి. జనవరిలో రోడ్డు భద్రత వారోత్సవాల నేపథ్యంలో ప్రమాదాల నియంత్రణకు అవగాహన పెంచుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. వాహనాలు నడుపుతున్నప్పుడు సెల్ ఫోన్ మాట్లాడటం మానివేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అదే విధంగా ఎవరికైనా ఫోన్ చేసినపుడు డ్రైవింగ్ లో ఉన్నానని చెబితే వెంటనే ఫోన్ కట్ చేస్తే బాగుంటుందంటున్నారు. కొద్ది దూరమే కదా, పోలీసులు ఉండరు కదా అని నిర్లక్ష్యంతో వాహనాలను నడిపినపుడు హెల్మెట్ లను ధరించకుండా ఉండటం కూడా ప్రమాదాలకు ప్రధాన కారణమవుతుందని పేర్కొంటున్నారు. అదే విధంగా వాహనాలను పరిమితికి మించిన వేగంతో నడపడం ద్వారా వాహనచోదకుడితో పాటు ఇతరులు కూడా రోడ్డు ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.



# సంక్రాంతి వేళ మోదీ గుడ్ న్యూస్

**నిజామాబాద్, మహా:** సంక్రాంతి పండుగ వేళ కేంద్ర ప్రభుత్వం పసుపు రైతులకు గుడ్‌న్యూస్ చెప్పింది. పసుపు బోర్డు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం జాతీయ పసుపు బోర్డు ప్రారంభోత్సవం చేయనున్నట్లు ప్రకటించింది. ఈ బోర్డుకు ఛైర్మన్‌గా పల్లె గంగారెడ్డిని నియమించింది. మూడేళ్ల పాటు ఈయన ఆ పదవిలో కొనసాగుతారని పేర్కొంది. తెలంగాణలో తాము అధికారంలోకి వస్తే జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ గతంలో హైదరాబాద్‌లో జరిగిన ఓ సభలో చెప్పిన సంగతి తెలిసిందే. సంక్రాంతి వేళ మోడీ ఆ మాట నెరవేర్చారు. మంగళవారం ఈ జాతీయబోర్డు ప్రారంభం కానుంది. ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రధానికి థ్యాంక్స్ చెప్పారు.

# రేషన్ కార్డుల జారీకి మార్గదర్శకాలు



**హైదరాబాద్, మహా:** కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు సంబంధించిన మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం ఎట్టకేలకు విడుదల చేసింది. ఈనెల 26 నుంచి రేషన్ కార్డుల మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులను జారీ చేసింది. రేషన్ కార్డుల అర్హత ప్రమాణాల పరిశీలనకు ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. ఉపసంఘం నిర్ణయాల ప్రకారమే రేషన్ కార్డుల జారీ జరుగుతుంది. ఇటీవల జరిగిన కుల గణన సర్వే ఆధారంగానే రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితా సిద్ధం చేశారు. కొత్త ఆహార భద్రత కార్డుల జారీ సంబంధించి విధి విధానాలు ఇలా ఉన్నాయి. కుల గణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డు లేని కుటుంబాల జాబితా జిల్లా కలెక్టర్లు/జీహెచ్ఎంసీ కమిషనర్‌కు క్షేత్రస్థాయి పరిశీలనకు పంపించబడుతుంది. మండల స్థాయిలో ఎంపీడీఓ/యూఎల్‌బీలో మున్సిపల్ కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులు. జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)/డీసీఎస్ఓ పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు. ముసాయిదా జాబితాను గ్రామసభ లేదా వార్డు సభలో ప్రదర్శించి చదివి వినిపించి చర్చించిన తర్వాత ఆమోదిస్తారు. గ్రామ సభ లేదా వార్డు సభల ద్వారా ఆమోదించబడిన లబ్ధిదారుల అర్హత జాబితాను మండల /మున్సిపాల్ స్థాయిలో ఇచ్చిన లాగిన్‌లో నమోదు చేసి జిల్లా కలెక్టర్ / జీహెచ్ఎంసీ కమిషనర్ లాగిన్‌కు పంపాలి. ఆ విధంగా పంపిన జాబితాను జిల్లా కలెక్టర్ / జీహెచ్ఎంసీ కమిషనర్ పరిశీలించి సంతృప్తి చెందితే పౌరసరఫరాల శాఖ కమిషనర్ లాగిన్‌కు పంపాలి.

## ఫైనల్ లిస్ట్ ప్రకారం జారీ

ఫైనల్ లిస్ట్ ప్రకారం సీసీఎస్ కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తారు. అర్హత కలిగిన వ్యక్తి ఒకే ఒక్క ఆహార భద్రత కార్డులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఆహార భద్రత కార్డుల్లో సభ్యుల చేర్పులు, తొలగింపులు చేయాలి. ఈ నేపథ్యంలో ఈ నెల 26 నుంచి అర్హత ఉన్న కుటుంబాలు కొత్త ఆహార భద్రత కార్డులు పొందుతారని విడుదల చేసిన మార్గదర్శకాల్లో పేర్కొందని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు.

# పెట్టుబడులకు గమ్య స్థానంగా తెలంగాణ



**హైదరాబాద్, మహా:** పెట్టుబడులకు గమ్య స్థానంగా తెలంగాణ దేశంలో అందరి దృష్టిని ఆకర్షిస్తుందని సీఎం రేవంత్ అన్నారు. జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో పరిశ్రమల శాఖపై అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు నరేందర్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జనవరి 20 నుంచి దావోస్ పర్యటన నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడుల సమీకరణ, వాటి పురోగతిని సీఎం రేవంత్ సమీక్షించారు. దేశ విదేశాల్లో పేరొందిన కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో అనుకూలమైన వాతావరణముందని సీఎం తెలిపారు. ఫ్యూచర్ సిటీగా వెలుగొందుతున్న హైదరాబాద్ సిటీలో ఉన్న సానుకూలతలను ప్రపంచ వేదికపై పరిచయం చేసేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం అందరినీ ఆకర్షిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తొలి ఏడాదిలోనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివద్ధి పనులన్నీ తెలంగాణను బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టాయని అన్నారు. గత ఏడాది ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న ఏయే కంపెనీలు రాష్ట్రంలో కార్యకలాపాలను ప్రారంభించాయి.. అవి ఏయే దశలో ఉన్నాయని సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. తొలి ఏడాదిలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ''గత ఏడాది దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో చేసుకున్న ఒప్పందాలతో రాష్ట్రానికి రూ.40232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 14 ప్రముఖ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు వచ్చాయి. దాదాపు 18 ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదిరాయి. వీటిలో దాదాపు 17 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని'' అధికారులు సీఎంకు వివరించారు. పది ప్రాజెక్టులు వివిధ దశల్లో వేగం పుంజుకున్నాయని, ఏడు ప్రాజెక్టుల అమలు ప్రారంభ దశలో ఉందని చెప్పారు. కంపెనీల వారిగా పురోగతిని మంత్రి శ్రీధర్ బాబుతో సీఎం చర్చించారు.

## 16 నుండి 22 వరకు పర్యటన

ఈ నెల 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు సీఎం దావోస్‌లో పర్యటించనున్నారు. సీఎంతో పాటు మంత్రి శ్రీధర్ బాబు, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఈ పర్యటనలో ఉంటారు. సింగపూర్‌లో స్కిల్ యూనివర్సిటీతో ఒప్పందాలతో పాటు ఇతర పెట్టుబడులకు సంబంధించి సంప్రదింపులు జరుపుతారు. దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. ఈ ఆరు రోజుల పర్యటనకు సంబంధించిన షెడ్యూలుతో పాటు, అక్కడ జరిగే సదస్సులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశాల ప్రణాళికను అధికారులు సీఎంకు వివరించారు.

# సర్క్యులర్ వివాదంలో గద్దర్ కూతురు వెన్నెల..?

## ఎమ్మార్పీఎస్ కార్యక్రమాల్లో పాల్గొనొద్దని హెచ్చరిక..!

### మందకృష్ణతోపాటు పలువురు ఆగ్రహం



**హైదరాబాద్, మహా:** గద్దర్ కూతురు వెన్నెల తాజాగా ఓ సర్క్యులర్ విడుదల చేయడంతో వివాదం చెలరేగుతోంది. ఈ సర్క్యులర్ పై ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్‌గా ఉన్న ఆమె తాజాగా ఓ ఉత్తర్వు విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ కార్యక్రమాల్లో మాదిగ కళాకారులు పాల్గొనకూడదని, ఒకవేళ ఈ ఆదేశాలను భేఖాతరు చేసి పాల్గొంటే కఠిన చర్యలుంటాయని అందులో పేర్కొన్నారు. ఈ విషయమై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ ఉత్తర్వులను ఆయన తీవ్రంగా ఖండించారు. నియంత పాలనగా అభివర్ణించిన కేసీఆర్ పాలనలో కూడా ఇటువంటి నిర్ణయాలు తీసుకోలేదంటూ ఆయన గుర్తుచేశారు. అసలు ఇంతకు వెన్నెల సాంస్కృతిక సారథి చైర్ పర్సన్‌గా అర్హురాలే కాదంటూ ఆయన విమర్శించాడు. సీఎం రేవంత్ రెడ్డికి తెలియకుండా కొంత మంది మాల కులానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇలాంటి నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తున్నారంటూ ఆయన సీరియస్ అయ్యారు.

అయితే, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించి ఇటీవలే సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సభలు, సమావేశాలు పెట్టి అన్ని వర్గాలతో మద్దతు తీసుకుంటున్నాడు. వెంటనే అమలు చేయాలంటూ ఆయన ప్రభుత్వాలను కోరుతున్నాడు. ఈ క్రమమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ ఆధ్వర్యంలో మాలల బలప్రదర్శనలు కూడా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వెన్నెల తీసుకున్న ఈ నిర్ణయం వివాదానికి దారి తీసింది. కాగా, ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో లక్ష డప్పులు, వేల గొంతుల పేరుతో మంద క్రిష్ణ మాదిగ భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. ఆ సభకు వెళ్లకుండా సారథిలో పనిచేస్తున్న మాదిగ కళాకారులను అడ్డుకోవడానికి ఇదంతా చేస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# రియాద్ పర్యటనకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**ఢిల్లీ, మహా:** సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో మూడు రోజులపాటు జరగనున్న 'ఫ్యూచర్ మినరల్స్ ఫోరమ్ మినిస్టీరియల్ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్' లో పాల్గొనేందుకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రియాద్ వెళ్ళారు. *'టువర్డ్స్ గ్రాండ్ అగ్రిమెంట్' థీమ్ తో ఈ సమావేశాలు జరగనున్నాయి. ఖనిజ వనరుల అభివృద్ధి అంశంపై ఈ సందర్భంగా విస్తృతమైన చర్చ ఉంటుంది. అనంతరం వివిధ దేశాల గనుల శాఖ మంత్రులతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొంటారు. ఈ కాన్ఫరెన్స్ లో కేంద్రమంత్రులు, కంపెనీల సీఈవోలు ఈ కాన్ఫరెన్స్ లో ప్రసంగించనున్నారు. ఖనిజ సంపదపై ఫలప్రదమైన చర్చ జరగడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఖనిజ సంపద సద్వినియోగం అవ్వాలన్న లక్ష్యంతో సౌదీ అరేబియా ప్రభుత్వం రియాద్ వేదికగా మూడేళ్లుగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు.

# వైభవంగా గోదాదేవి కల్యాణం

## పాల్గొన్న మంత్రి సీతక్క

**మంచిర్యాల, మహా:** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయంలో సోమవారం రాత్రి రంగనాథ గోదాదేవి కళ్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. వేద పండితులు వేదమంత్రోచ్ఛారణల మధ్య కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణ వేడుకల్లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావులు పాల్గొన్నారు. వారికి ఆలయ పూజారులు ప్రత్యేకంగా స్వాగతం పలికి వేద ఆశీర్వచనాన్ని అందించారు.



# టూరిజం హబ్‌గా తెలంగాణ

## అబ్బురపరిచిన వివిధ రాష్ట్రాల కైట్ కళా ప్రదర్శనలు.. దేశ్ కా షాన్ హైదరాబాద్

### పర్యటక రంగాన్ని ఆస్వాదించేందుకు తెలంగాణకు రావాలి టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు



**హైదరాబాద్, మహా :** పర్యాటక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో సంక్రాతి పండుగ సందర్భంగా టూరిజం, సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్స్ ఫెస్టివల్ మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ తెలంగాణ పూర్వ వైభవాన్ని ప్రపంచానికి తెలిసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం టూరిజం పాలసీ తెచ్చి తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని అన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ మహానగరంలో నివసిస్తున్న దేశ విదేశీయులకు మన కల్చర్ ను తెలియజేస్తున్నామని అన్నారు.టూరిజం కోసం ప్రతి ఒక్కరు నెలలో రెండు రోజులు కేటాయించాలని మంత్రి విజ్ఞప్తి చేసారు.ఈ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ లో 19 దేశాలకు సంబంధించిన 50 మంది వివిధ రాష్ట్రాలకు చెందిన 50 కు పైగా ప్లేయర్స్ రావడం ఈ కల్చర్ యొక్క గొప్పతనం అని, మన సంస్కృతి సంప్రదాయాలు కనుమరుగు అవుతున్న తరుణంలో భావితరాలకు తెలిసే విధంగా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని అన్నారు. తదుపరి డిజిటల్ కైట్స్, రిమోట్ స్కైట్స్ ప్రారంభించారు.రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సాంస్కృతిక ప్రేమికులకు భోగి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాంస్కృతిక శాఖ తరుపున కైట్ & స్వీట్ ఫెస్టివల్ జరుగుతుందని గత సంవత్సరం కంటే మరింత బాగా ఈసారి జరుగుతుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం టూరిజం పాలసీ తీసుకొచ్చిందని తెలంగాణను టూరిజం హబ్ గా మారుస్తామని అన్నారు. పురాతన కట్టడాలు ,వాటర్ ఫాల్స్ తదితర వాటిని టూరిజం లో అభివృద్ధి చేయబడుతుందన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉన్నందున హైదరాబాద్ ప్రజలు పరేడ్ గ్రౌండ్ లో జరుగుతున్న అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ లో పాల్గొని తీపి రుచులను ఆస్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ డా. వెన్నెల గద్దర్, రోడ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సంకేపల్లి సుధీర్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్, పర్యాటక శాఖ సంచాలకులు జెండగే హనుమంతు కొండిబా, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, కైట్ ఫెస్టివల్ కన్సల్టెంట్ పవన్. డి. సోలంకి, క్లిక్ కన్వీనర్ లిబి బెంజిమన్, దేశీయ, అంతర్జాతీయ కైట్ ప్లయర్స్, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు

ANN తెలుగు
మహా పత్రిక 03
మంగళవారం, హైదరాబాద్ | 14-01-2025
జనరల్ వార్తలు | GENERAL NEWS
WWW.MAHAADAILY.COM

# మహా కుంభమేళా

మహా కుంభమేళా సమయంలో త్రివేణి సంగమంలో స్నానం చేస్తే సమస్త పాపాలు నశించి.. మోక్షం లభిస్తుందని భక్తులకు ఎనలేని విశ్వాసం. 12 కుంభమేళాలకు ఒకసారి అంటే 144 ఏళ్లకు ఒకసారి జరిగే మహా కుంభమేళా ఇప్పుడు ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లోని గంగా, యమునా, సరస్వతి నదుల త్రివేణి సంగమం వద్ద అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఈ మహా కుంభమేళా ప్రారంభం కాగా.. ఫిబ్రవరి 26వ తేదీ వరకు జరగనున్నాయి. ఇప్పటికే దాదాపు కోటి మంది త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేశారు. ఈ క్రమంలోనే ఈ 45 రోజుల్లో వివిధ రకాల రాజ స్నానాలు చేయనున్నారు. మొత్తం ఆరు రోజుల పాటు ఈ రాజ స్నానాలు జరగనున్నాయి. ఈ మొత్తం మహా కుంభమేళాలో ఈ రాజ స్నానాలే అత్యంత ముఖ్యమైనవి. మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు వివిధ తేదీల్లో ఈ పుణ్య స్నానాలను ఆచరించనున్నారు. ఈ 6 రాజ స్నానాలకు హిందూ పురాణాల్లో ఎనలేని ప్రత్యేకత ఉంది.

## మహా..మహా..

### 144 సంవత్సరాలకు సమానం

సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించిన సమయంలో ఈ మహా కుంభమేళా ప్రారంభం అవుతుంది. భూమిపై ఏడాది గడిస్తే.. దేవతలకు ఒకరోజుతో సమానం. దేవతలు, రాక్షసుల మధ్య 12 ఏళ్ల పాటు యుద్ధం జరగ్గా.. 12 ఏళ్లకు ఒకసారి పూర్ణకుంభమేళా నిర్వహిస్తారు. ఇక 12 పూర్ణ కుంభమేళాలు అంటే 144 ఏళ్లకు.. అదే సమయంలో దేవతలకు 12 సంవత్సరాలైతే.. భూమిపై 144 సంవత్సరాలకు సమానం అవుతుంది. అందుకే 144 సంవత్సరాలకు ఒకసారి మహా కుంభమేళా జరుగుతుంది.





# అజిత్ కుమార్ రేసింగ్



## 13 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ మోటార్ రేసింగ్‌లోకి...

### దుబాయ్ రేస్ లో మూడవ స్థానంలో ఇండియాను నిలిపిన అజిత్ టీమ్ రేసింగ్ పోటీలు ముగిసేదాకా.. సినిమాలకు గుడ్ బై

**కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.** ఇన్నాళ్లు సూపర్ హిట్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ఈ హీరో ఇప్పుడు కొత్త సంవత్సరంలో ప్రత్యేకమైన విజయాన్ని సొంతం చేసుకున్నారు. కోలీవుడ్ టాప్ హీరోలలో ఒకరిగా ఉన్న అజిత్ కుమార్ కార్ రేసర్‌గా ఎంపికయ్యారు. ఆయన నాయకత్వంలోనే అజిత్‌కుమార్ రేసింగ్ పేరుతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ జట్టు 24 హెచ్ దుబాయ్ 2025 కార్ రేస్‌లో పాల్గొనడమే కాకుండా విజయం కూడా సాధించింది. ఈ రేసులో అజిత్ సారథ్యంలోని జట్టు మూడో స్థానంలో నిలిచి రికార్డు సృష్టించింది. హోరా హోరిగా సాగిన ఈ రేసింగ్ లో ఆయన టీం 901 పాయింట్లు సాధించి 3వ స్థానంలో నిలిచింది. ఈ వార్త ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ అభిమానులకు, నటీనటులకు, సినీ పరిశ్రమకు అజిత్ అభిమానులకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. ఇటీవల జరిగిన ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడిన అజిత్.. ఎలాంటి ఇబ్బంది లేకుండా రేసులో పాల్గొని విజయం సాధించారు. దీంతో ఆయనకు స్పిరిట్ ఆఫ్ రేస్ అనే అవార్డును అందించింది టీమ్. ఇందుకు సంబంధించిన ఫోటోస్, వీడియోస్ వైరలవుతున్నాయి.

- మహా ప్రత్యేకం

### సినిమాలకు దూరం

అజిత్ కుమార్ రేసింగ్ అనే రేసింగ్ టీమ్‌కు యజమాని. సెప్టెంబర్ 2024లో దీన్ని ప్రారంభించిన ఆయన, ప్రస్తుతం పోర్షే 992 పోటీతో పాటు, ఆసియా ఫార్ములా బిఎండబ్ల్యు ఛాంపియన్‌షిప్, బ్రిటిష్ ఫార్ములా 3 ఛాంపియన్‌షిప్ మరియు ఎఫ్ ఐఏ ఫార్ములా 2 ఛాంపియన్‌షిప్‌లలో కూడా పాల్గొననున్నారు. ప్రస్తుతం అజిత్ ప్రాక్టీస్ చేస్తున్న కార్ రేస్ జనవరి 13న ముగిసింది. 18 ఏళ్ల నుంచే కార్ రేసింగ్‌పై ఆసక్తి ఉందని, 2002 నుంచి కార్ రేసింగ్‌లో పాల్గొనడానికి ప్రయత్నించి, 2003, 2004లో పాల్గొన్నానని తెలిపారు. ఆ తర్వాత ఇతర పనుల్లో బిజీగా ఉండటంతో కార్ రేసింగ్‌లో పూర్తిగా పాల్గొనలేకపోయానని చెప్పారు. అలాగే వరుసగా పాల్గొననున్న రేస్ సిరీస్‌లు ముగిసే వరకు 9 నెలలు ఏ సినిమాలోనూ నటించబోనని అజిత్ వెల్లడించారు. సినిమాల్లో నటించడం వల్లనే కొంతకాలం కార్ రేసింగ్‌లో పాల్గొనలేకపోయానని ఆయన ఇంటర్వ్యూలో తెలిపారు. కార్ రేసింగ్ అంటే అజిత్‌కు ఎంతో ఇష్టమని అందరికీ తెలిసిందే. ప్రస్తుతం కార్ రేసింగ్‌లో పాల్గొనున్నందున, దానిపై పూర్తిగా దృష్టి పెట్టనున్నారు. కాబట్టి కార్ రేస్ ముగిసిన తర్వాతే అజిత్ నటించే సినిమా గురించి సమాచారం వెలువడుతుందని అంటున్నారు. ప్రస్తుతం అజిత్, మగిజ్ తిరుమేని దర్శకత్వంలో 'విడాముయర్చి' చిత్రంలో, ఆదిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాల్లో నటించి ముగించారు.

### సర్వత్రా హర్షం

బ్రేక్స్ ఫెయిల్ కావడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. ఈఘటనలో అజిత్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కానీ గాయాలను ఏమాత్రం లెక్కచేయకుండా మరోసారి రేసింగ్ పోటీలో పాల్గొని విజయం సాధించారు అజిత్. ఈ పోటీలో అజిత్ టీం విజయం సాధించడంతో సినీ ప్రముఖులు, అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. శివకార్తికేయన్, మాధవన్, ప్రసన్న, దర్శకుడు మజీజ్ తిరుమేని, అధిక్ రవిచంద్రన్, వెంకట్ ప్రభు, నటి పార్వతి తదితరులు నటుడు అజిత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

### రేస్‌కార్ డ్రైవర్‌గా అజిత్ చరిత్ర

నటుడు అజిత్ రేసింగ్‌లో అనుభవజ్ఞుడు, అతను గతంలో ఫార్ములా బీఎండబ్ల్యు ఆసియా, బ్రిటిష్ ఫార్ములా 3 మరియు ఎఫ్ ఐఏ ఛాంపియన్‌షిప్‌లలో పాల్గొన్నాడు. అటువంటి క్రాష్‌లు ఉద్వేగభరితమైన అజిత్ ఇష్టాన్ని ప్రభావితం చేయవని అనుకుంటున్నాము. మరియు రేసింగ్‌ను కొనసాగించాలనే డ్రైవర్ యొక్క సంకల్పం మరియు యజమానిగా అవసరమైన జట్లకు హాజరు కావడం ద్వారా అదే ప్రతిబింబిస్తుంది

### ప్రపంచాన్ని చుట్టేసే కథానాయకుడు

అజిత్ నటించిన విదాముయార్చి సినిమా ఈ సంక్రాంతికి విడుదల కావాల్సి ఉంది. కానీ చిత్రయూనిట్ ఈ సినిమాను వాయిదా వేసింది. మరోవైపు కొన్ని నెలలుగా అజిత్ దుబాయ్‌లో కార్ రేస్ కోసం పూర్తి సమయం శిక్షణ శిక్షణ తీసుకుంటున్న సంగతి తెలిసిందే. సినిమాలతోపాటు అజిత్ కు కార్ రేసింగ్, బైక్ రేసింగ్ అంటే చాలా ఇష్టం. షూటింగ్ నుంచి కాస్త బ్రేక్ దొరికితే బైక్ పై ప్రపంచాన్ని చుట్టేందుకు రెడీ అవుతాడు. ఇప్పుడు దాదాపు 13 సంవత్సరాల తర్వాత మోటార్ రేసింగ్ లో పాల్గొన్నారు. ఈ రేసు కోసం చాలా రోజుల నుంచి శ్రమిస్తున్నారు. ఇటీవల ట్రాక్ మీద ప్రాక్టీస్ చేస్తుండగా.. ఆయన కారు ప్రమాదానికి గురైంది. గోడను బలంగా ఢీ కొనడంతో కారు ముందు భాగం పూర్తిగా డ్యామేజ్ అయ్యింది.



# ఘనంగా భోగి వేడుకలు

## రాష్ట్ర ప్రజలందరికీ భోగి శుభాకాంక్షలు

### సంక్రాంతి సంబరాలు మన సాంప్రదాయంలో భాగం.. హోం మంత్రి వంగలపూడి అనిత




**పాయకరావుపేట, మహా:** నక్కపల్లి మండలం సారిపల్లిపాలెం హోం మంత్రి అనిత స్వగృహం వద్ద సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. భోగి మంటలు, గంగిరెద్దుల ఆటలు, హరిదాసు పాటలు, రంగువల్లులు, కోలాటాలు, సంప్రదాయ వంటకాల ప్రదర్శనతో నిర్వహించిన సంబరాలు పాయకరావుపేట నియోజకవర్గ వాసులను ఎంతగానో అలరించాయి. తొలుత భోగిమంటలతో మంత్రి అనిత వేడుకలను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన గంగిరెద్దు ఆటలో సందడి చేశారు. పిల్లలపై భోగి పండ్లు వేసి ఆశ్వీరదించారు. సంప్రదాయ వంటకాల ప్రదర్శనను తిలకించారు. తెలుగు ప్రజలకు హోం మంత్రి వంగలపూడి అనిత భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భోగి భోగభాగ్యాలతోపాటు జీవితాల్లో కొత్త వెలుగు నింపాలని ఆకాంక్షించారు. పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలతో కలిసి సంక్రాంతి పండుగ జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని మంత్రి అనిత అన్నారు. సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 150 మంది మహిళలు పాల్గొన్నారు. పాయకరావుపేటకు చెందిన పరదేశి లక్ష్మికి మొదటి బహుమతి (రూ. 20,000), గొట్టివాడకు చెందిన హారికకు ద్వితీయ బహుమతి (రూ.15,000), కొత్తపల్లికి చెందిన కె. రమణమ్మకు తృతీయ బహుమతి (10 వేల రూపాయలు)ని మంత్రి అనిత ముగ్గుల పోటీల విజేతలకు అందజేశారు. కేరళానృత్యం, కోలాటాలు, తప్పెటగుళ్ళు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచాయి.

# సాగునీటి ప్రాజెక్టులకు తొలి ప్రాధాన్యత

## పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు






**ఖమ్మం, జనవరి 13, మహా:** సాగునీటి ప్రాజెక్టులకు తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సోమవారం రఘునాథపాలెం మండలంలో రూ. 66.33 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న మంచుకొండ చిన్న నీటి ఎత్తిపోతల పథకం ఆన్ లెఫ్ట్ బ్యాంక్ ఆఫ్ ఎన్.ఎస్.ఎల్.బి.సి. నిర్మాణ పనులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ లతో కలిసి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధికంగా ఆయకట్టు సాగు పనులకు ప్రాధాన్యత కల్పిస్తూ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం కింద 54 కోట్లతో 2400 పైగా ఎకరాల ఆయకట్టు సాగు నీరు అందుతుందని అన్నారు. జనవరి 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డుల జారీ వంటి మరో 4 కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. మనం చేపట్టే పనులను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఖమ్మం జిల్లాలో వ్యవసాయం ప్రాధాన్యంగా ఉందని, ఇక్కడ వ్యవసాయదారిత పరిశ్రమల ఏర్పాటుకు మనమంతా ప్రణాళిక ప్రకారం పని చేయాలని డిప్యూటీ సీఎం తెలిపారు.

కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఇంచార్జ్, రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ 2500 ఎకరాలకు సాగు నీటి సరఫరా చేసేందుకు మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం 66 కోట్లతో చేపట్టిందని అన్నారు. సాగునీటి వసతి లేని పొలాలకు అపర భగీరధుడై మంత్రి తుమ్మల ప్రత్యేక కృషితో మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయించారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మంచుకొండ ఎత్తిపోతల పథకం చాలా మంచి పథకమని, 54 కోట్ల ఖర్చుతో 27 చెరువుల క్రింద 2400 ఎకరాల ఆయకట్టు రావడం చాలా సంతోషకరమని అన్నారు. రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించే పనులకు ప్రాధాన్యత కల్పించామని అన్నారు. గత పాలకులు కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి, సీతారామ, మొదలగు భారీ ప్రాజెక్టుల క్రింద 1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి నామమాత్రపు ఆయకట్టు మాత్రమే సాధించారని అన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకానికి 8500 కోట్లు ఖర్చు చేసిన ఒక్క ఎకరం ఆయకట్టు సాగులోకి రాలేదని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడంతో పాటు కొత్త పనులను చేపట్టి ప్రతి ఎకరానికి సాగునీరు సరఫరా చేసే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రాజెక్టులను పూర్తి చేసి కాల్వల ద్వారా రైతులకుసాగు నీరు అందించే బృహత్తర బాధ్యతను సాగు నీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీసుకున్నారని అన్నారు. రాబోయే వానాకాలం నాటికి పనులు పూర్తి చేసి సాగునీటి సరఫరా చేసే అవకాశం ఉన్న పనులకు ప్రాధాన్యత క్రమంలో భూ సేకరణ చేయాలని, పనులు చేపట్టి బిల్లుల చెల్లింపు చేయాలని మంత్రి తుమ్మల తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా లిఫ్ట్ కెనాల్త వ్వితే వైరాకు నీళ్ళు వస్తాయని, లక్షన్నర ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు అవకాశం ఉంటుందని ప్రతిపాదిస్తే వెంటనే కాల్వ పనులకు నిధులు మంజూరు చేశారని మంత్రి తుమ్మల తెలిపారు. 20 సంవత్సరాలుగా మంత్రిగా తన జీవితంలో ఖమ్మం జిల్లాలోని ప్రతి మండలానికి ఏదో ఒక ప్రాజెక్టు క్రింద సాగు నీరు సరఫరా చేసామని, రఘునాథ పాలెం మండలం కోసం బుగ్గ వాగు ప్రాజెక్టు చేపట్టినప్పటికీ అనివార్య కారణాల వల్ల పూర్తి కాలేదని, ఇక్కడ ప్రాంత ప్రజలకు సాగునీరు అందించేందుకు ప్రతిపాదించిన మంచుకొండ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మార్పు కావాలని ప్రజలు భావించి ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత పాలకులు విచ్ఛిన్నం చేసినప్పటికీ, గత సంవత్సర కాలంగా ఆర్థిక పరిస్థితిని బాగు చేసుకుంటూ కొన్ని హామీలను నెరవేర్చామని, రెండవ సంవత్సరంలో ప్రజల అభీష్టం మేరకు నూతన రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ,మహబూబాబాద్ ఎంపి బలరాం ఖమ్మం సీపీ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, ఇర్రిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వర రావు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# వైఎస్ఆర్ బతికి ఉన్నా

## తెలంగాణ ఏర్పాటు ఆగేది కాదు

### మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



తెలంగాణ రాష్ట్ర విభజనపై ఉమ్మడి ఏపీ చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి బతికి ఉంటే రాష్ట్ర విభజన జరిగి ఉండేది కాదని చాలా మంది అనుకుంటూ ఉంటారని కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. రాజశేఖర్ రెడ్డి బతికున్నా తెలంగాణ ఏర్పాటు ఆగేది కాదని తెలిపారు. ఏపీలోని విజయవాడలో జరిగిన సంక్రాంతి ఆత్మీయ సమ్మేళనంలో కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. 2014లో కాదు.. అసలు 2009లోనే తెలంగాణ రాష్ట్రం రావాల్సి ఉండేదని పేర్కొన్నారు. రాష్ట్ర విభజనకు వ్యతిరేకం కాదనే తీర్మానాన్ని రాజశేఖరరెడ్డి హయాంలోనే కాంగ్రెస్ అధిష్ఠానం పెట్టించాలని చూసిందని కిరణ్ కుమార్ రెడ్డి సంచలన విషయాన్ని వెల్లడించారు. తాను చీఫ్ విప్‌గా ఉన్నప్పుడు రాజశేఖరరెడ్డి పిలిచి.. 'మనం తెలంగాణ రాష్ట్రానికి అనుకూలం' అనే తీర్మానాన్ని అసెంబ్లీలో పెట్టాలని చెప్పారని తెలిపారు. ఎన్నికల ముందు మనం ఈ తీర్మానాన్ని పెడితే మనం ఓడిపోతామని వైఎస్‌తో తాను చెప్పాననని అన్నారు. 'నా చేతుల్లో ఏమీ లేదు. రాష్ట్ర విభజన చేయాలని ప్రణబ్ ముఖర్జీ చెప్పారు' అని వైఎస్ఆర్ తనతో అన్నారని చెప్పారు. దీంతో తాము ప్రణబ్ ముఖర్జీతో మాట్లాడామని.. 'మేం తెలంగాణకు అనుకూలం' అనే తీర్మానాన్ని 'మేం తెలంగాణకు వ్యతిరేకం కాదు' అని మార్చి పెట్టామని వెల్లడించారు.

# తిరుపతి జిల్లాలో మరో రోడ్డు ప్రమాదం

## భాకరాపేట ఘాట్ రోడ్డుపై 2 ఆర్టీసీ బస్సులు ఢీ




తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. భాకరాపేట ఘాట్ రోడ్డులో రెండు ఆర్టీసీ బస్సులు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో 30 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఒక బస్సు ముందు భాగం నుజ్జునుజ్జుకావడంతో క్యాబిన్‌లోనే డ్రైవర్ ఇరుక్కుపోయాడు. డ్రైవర్‌ను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా, ప్రమాదం కారణంగా రెండు బస్సులు ఘాట్ రోడ్డుపై అడ్డంగా పడిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. దీంతో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మరోవైపు తిరుమల రెండో ఘాట్ రోడ్డులో ఒక ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పిట్టగోడను ఢీకొట్టింది. క్రాష్ బారియర్ పటిష్టంగా ఉండటంతో అదృష్టవశాత్తూ బస్సు లోయలో పడకుండా పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో పలువురు భక్తులు స్వల్పంగా గాయపడ్డారు. కాగా, ఘాట్ రోడ్డుపై బస్సు అడ్డంగా నిలిచిపోవడంతో కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి.

# నిషేధిత చైనా మంజా విక్రయదారులపై 107 కేసులు

నిషేధిత చైనా మంజాలపై(Chinese manjas) నగర టాస్క్‌ఫోర్స్ విభాగం, స్థానిక పోలీసులతో కలిసి నాలుగు నెలల్లో 107 కేసులు నమోదు చేసిందని టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర తెలిపారు. ఈ మేరకు సోమవారం టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ శ్రీనివాస్‌రావు విలేకరుల సమావేశంలో వవరాలను వెల్లడించారు. సింథటిక్ నైలాన్, గ్లాస్ కోటింగ్‌తో తయారు చేసిన పతంగుల దారాలతో మనిషులతో పాటు జంతువులు, పక్షుల ప్రాణాలకు హాని జరుతుందని, ఈ నేపథ్యంలో చైనా మంజాలపై నిషేధం ఉందన్నారు. అయినా కూడా కొందరు వ్యాపారులు చైనా మంజాలను తెచ్చి విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే గత అక్టోబర్ నెల నుంచి జనవరి 13వ తేదీ వరకు నగరంలోని ఏడు జోన్లలో స్థానిక పోలీసులతో కలిసి 107 కేసులు నమోదు చేసి 148ని అరెస్ట్ చేసినట్లు వివరించారు.



వీరి వద్ద నుంచి రూ. 90 లక్షల విలువైన 7334 చైనా మంజా బబ్బిన్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. చైనా మంజాలను ఎవరు కూడా వాడకూడదని సూచించారు.

## పెంచిన కరెంటు చార్జీలను తగ్గించాలంటూ నిరసన

# భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దగ్ధం



**అనకాపల్లి జిల్లా ,పాయకరావుపేట, మహా :** ఎస్. రాయవరం మండలం,పి.ధర్మవరం గ్రామంలో సిపిఎంఆధ్వర్యంలో సోమవారం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని విద్యుత్ బిల్లులు భోగిమంటల్లో వేసి దగ్ధం చేయడం జరిగింది . ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం . అప్పలరాజు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రతిపక్షంగా ఉన్నప్పుడు గత ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా బాదుడే బాదుడు కార్యక్రమం చేపట్టి ఆ పోరాటంలో తెలుగుదేశం అధికారంలోకొస్తే భవిష్యత్తులో పెంచబోము అని వాగ్దానం చేశారు. కానీ ఆ వాగ్దానాన్ని తుంగలోకి తొక్కి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎప్పుడో వాడిన కరెంటుకు ఇప్పుడు ట్రూ ఆఫ్ చార్జీలు అని పేరు చెప్పి ఇప్పుడు ప్రజల మీద 18000 కోట్ల రూపాయలు విద్యుత్ భారం వేయటం చాలా దుర్మార్గమైన చర్య అని ప్రజల మీద వేసిన విద్యుత్ బారాలను వేల కోట్ల రూపాయలు 2022 సంవత్సరానికి సర్దుబాటు చార్జీలు ప్రజలపై భారం వేస్తుంది మరోవైపు అదానికి లొంగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రతిమీటర్ కి 15 వేల రూపాయలు చార్జీల్లో వసూలు చేయడం రాత్రి ఒక రేటు పగల ఒక రేటు ప్రజలపై విద్యుత్ చార్జీలు జనవరి ఒకటి నుండి 15 వేల కోట్ల రూపాయలు విద్యుత్ చార్జీలు పెంచడానికి ప్రభుత్వం బరితెగించిందని మండిపడ్డారు. ఈ విద్యుత్ బిల్లులు దగ్ధం కార్యక్రమంలో ఎం . లక్ష్మి, ఎస్.భాస్కర్, ఎస్. రమణ, ఎస్.వెంకటలక్ష్మి, ఎన్.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# త్వరితగతిన ప్రాజెక్టులను పూర్తి చేయాలి


## ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరయ్య




**కడప, మహా:** ఎగువభద్రకు జాతీయ హోదా, నీటి కేటాయింపులపై పున:సమీక్ష రాయలసీమకు మరణ శాసనమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరయ్య అన్నారు. కడపలో అయన మీడియాతో మాట్లాడుతూ రాయలసీమలో తగినంత వర్షపాతం నమోదు కాక ప్రతి ఏటా కరువు బారిన పడి చేసిన అప్పులు తీర్చలేక అవమాన భారంతో రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయన్నారు. గ్రామీణ ప్రజలు ఉపాధి లేక వలస పోతున్నారని, అతివృష్టి అనావృష్టికి శాశ్వత పరిష్కారమైన కృష్ణా జలాలు రాయలసీమకు మళ్లించాలని ప్రజలు పెద్ద ఎత్తున పోరాటం చేశారన్నారు. పోరాటాల ఫలితంగా చేపట్టిన ప్రాజెక్టులు నాలుగు దశాబ్దాలు దాటుతున్నా ప్రాజెక్టులు పూర్తి చేయడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కాకపోవడం వల్ల బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం నికరజలాలను కోల్పోవలసి వచ్చిందన్నారు. మిగులు జలాలను వాడుకునే వెసులుబాటును ఆధారంగా చేసుకొని నిర్మాణంలో ఉన్న గాలేరు నగరి హంద్రీనీవా వెలుగొండ ప్రాజెక్టులకు బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఆయింపులు చేయకుండానే మిగులు జలాలను కూడా లెక్క గట్టి మూడు రాష్ట్రాలకు పంపిణీ చేసి రాయలసీమపై మరణశాసనం చేసిందన్నారు. బ్రిజేష్ కుమార్ తీర్పు సుప్రీంకోర్టులో వ్యాజ్యం నడుస్తుండగా కర్ణాటక ఎన్నికల ప్రయోజనాల కోసం బిజెపి ప్రభుత్వం ఎగువ భద్రకు జాతీయ హోదా కల్పించడం, తెలంగాణ ఎన్నికల ప్రయోజనాల కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ప్రాజెక్టుల వారీగా కేటాయించిన నీటిని పునసమీక్ష చేస్తూ వివాదాస్పద బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కు కట్టబెట్టడం, రాయలసీమ దుర్భిక్ష రహిత ప్రాంతం కోసం చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకంపై ఎన్జీటీ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కు ఫిర్యాదు చేయించడం బట్టి చూస్తే నీటి వివాదాలను పరిష్కారం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం నీటి వివాదాలను మరింత జటిలం చేసే స్వార్థ రాజకీయాలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న రాయలసీమ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధుల కేటాయింపులో తీవ్రమైన నిర్లక్ష్యం వహిస్తూ అంచనా అంచనా వేయాలను అమాంతం పెంచుకుంటూ ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయకుండానే కొత్త ప్రాజెక్టుల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. గత ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం పేరుతో చేపట్టిన పనులు పూర్తికాకుండానే దిగిపోయింది అన్నారు, ప్రస్తుత ప్రభుత్వం పోలవరం బెనకచర్ల ఎత్తిపోతల పథకం పేరుతో లక్షల కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నట్లు ప్రకటించడం చూస్తుంటే పాలక ప్రభుత్వాలు నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసే ఆలోచనలో లేనట్లు స్పష్టమవుతుందన్నారు. హక్కులు అవకాశాలను కోల్పోయి దగాపడ్డ వెనుకబడ్డ రాయలసీమ రైతాంగ మరోమారు నష్టపోకుండా ఉండేందుకు మరో మరో ఉద్యమానికి సంబంధం కావాల్సిన అవసరం ఉన్నది అన్నారు. మరో మారు ఉద్యమానికి సన్నద్ధం చేసేందుకు ఫిబ్రవరి 15 నుండి 17 వరకు కడపలో జరుగుతున్నాయని, రాయలసీమ నెల్లూరు ప్రకాశం ఉమ్మడి జిల్లాల ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభ జయప్రదం చేయాలన్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న ప్రాజెక్టుల మహాసభకు నీటిపారుదల రంగ నిపుణులు, రైతు సంఘం జాతీయ నేతలు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవీ సుబ్బారెడ్డి, పి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మన్ననలు పొందిన ఛానల్ ఏఎన్ఎన్

### నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఆడే గజేందర్



**ఆదిలాబాద్, మహా:** నేరడిగొండ మండల కేంద్రంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆడే గజేందర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డితో కలిసి తన క్యాంపు కార్యాలయంలో ఏఎన్ఎన్ క్యాలెండర్ లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ ఏఎన్ఎన్ ఛానల్ అతి తక్కువ సమయంలోనే ప్రజల మన్ననలు పొంది అత్యంత ప్రజాదరణ పొందిన ఛానల్ గా గుర్తింపు తెచ్చుకుందని అన్నారు. ఇలాగే రానున్న రోజుల్లో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ, ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఏఎన్ఎన్ యాజమాన్యానికి, సిబ్బందికి, వీక్షకులకు, బోథ్ నియోజకవర్గం ప్రజలకు సంక్రాతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఎల్మ వినయ్ రెడ్డి, యువనాయకులు సద్దాం, సీనియర్ నాయకులు సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

# బాధలో బాసటగా...

**కంది శ్రీనివాస రెడ్డి పరామర్శలు.. వాఘాపూర్ లో ఓ కుటుంబానికి ఆర్థిక సాయం**



**ఆదిలాబాద్, మహా:** ఆత్మీయులను కోల్పోయి దుఃఖంలో ఉన్న పలువురిని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఇచ్చోడ మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమూద్ ఖాన్ ఇటీవల గుండె పోటుతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను కంది శ్రీనివాసరెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా వాఘాపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మర్సకోల అశోక్ చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థికసాయం అందజేసి ఉదారత చాటుకున్నారు. బెల్లూరి గ్రామంలో కౌన్సిలర్ కలాల శ్రీనివాస అత్తమ్మ గంగమ్మ చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులను సైతం పరామర్శించారు. కంది శ్రీనివాస రెడ్డి వెంట డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు చిక్కాల దత్తు, షేక్ ఖలీద్, ఎంఏ షకీల్, లోకప్రవీణ్ రెడ్డి, మొహమ్మద్ రఫీక్, డేరా కృష్ణారెడ్డి, తిప్పిరెడ్డి, విట్టల్ రెడ్డి తదితరులున్నారు.

## మాజీ ఎంపీతో కంది శ్రీనివాస రెడ్డి ఆత్మీయ భేటీ



**ఆదిలాబాద్, మహా:** మాజీ ఎంపీ సోయం బాపురావుతో కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆత్మీయంగా భేటీ అయ్యారు. బీజేపీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత మొదటి సారిగా సోయం బాపురావును ఆయన నివాసానికి కాంగ్రెస్ శ్రేణులతో వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పార్టీలోకి గ్రాండ్ గా వెల్‌కం చెప్పారు. చాలా అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, డేరా కృష్ణారెడ్డి, నరేష్ రెడ్డి, మైనార్టీ నాయకులు షకిల్, రఫీక్ తదితరులు ఉన్నారు.

## గురుకుల పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తులు

■ ఐదవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు..ఆన్ లైన్ పద్ధతిలో దరఖాస్తు స్వీకరణ

పాఠశాల ప్రిన్సిపాల్ మెర్సీ వరూధిని



**ఇబ్రహీంపట్నం, మహా:** తెలంగాణ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లుగా ఇబ్రహీంపట్నం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలుర) ప్రిన్సిపాల్ మర్సీ వరూధిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 25 విద్యా సంవత్సరంలో నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఐదవ తరగతికి అర్హులనీ తెలిపారు. 5వ తరగతి కామన్ ఎంట్రెన్స్ ద్వారా ప్రవేశాలు తీసుకోబడుతుందన్నారు. 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు కూడా దరఖాస్తులు తీసుకోనున్నట్లు ఆమె తెలిపారు. దరఖాస్తుల చివరి తేదీ ఫిబ్రవరి ఒకటవ తారీకు వరకు ఉందని, దరఖాస్తు చేసుకునే సమయంలో దరఖాస్తుతోపాటు కులం, ఆదాయం, ఆధార్ ధ్రువీకరణ పత్రాలతో పాటు పాస్ ఫొటో, రూ.100 రుసుముతో ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

## మీర్ఖాన్ పేట్ గ్రామాన్ని దత్తత తీసుకున్న అమెజాన్ సంస్థ

**గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న సంస్థ..గ్రామాన్ని దత్తత తీసుకోవడం అభినందనీయం**

**మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి**




**కందుకూరు, మహా:** మండలంలోని మీర్ఖాన్ పెట్ గ్రామాన్ని ప్రముఖ అమెజాన్ సంస్థ దత్తత తీసుకుంది. ఈ మేరకు ఆ గ్రామంలో సదరు సంస్థ పలు సేవా కార్యక్రమాలను ప్రారంభించింది. సోమవారం మీర్ఖాన్ పెట్ గ్రామంలో అమెజాన్ వెల్ఫేర్ సొసైటీ (ఏడబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో చేపట్టిన ఓపెన్ జిమ్, పార్క్, తాగునీటి ఆర్ఓ వాటర్ ఫిల్టర్, పీహెచ్సీ హెల్త్ సెంటర్ మరమ్మత్తులు, అంగన్వాడీ అభివృద్ధి, లైబ్రరీ పనులను మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. అమెజాన్ సంస్థ ద్వారా అందుతున్న సామాజిక సేవాకార్యక్రమాలు మరువలేనివని, వారు అందిస్తున్న సేవాకార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అమెజాన్ సంస్థ ముఖ్య అధికారి సాచ్యతోపాటు ఇతర ప్రముఖులు, నియోజకవర్గం ప్రజా ప్రతినిధులు మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సరదాల సంక్రాంతి

- ■ ఊరూవాడ పండగ సందడి
- ■ ఇంటి ముంగిళ్లలో గొబ్బెమ్మలు అందమైన రంగవల్లులు
- ■ నింగిని కప్పేసేలా పతంగులు
- ■ ఘుమ ఘుమలాడే పిండివంటలు ■ బసవన్నల ఆటలు
- ■ హరిదాసుల పాటలు ■ మార్కెట్లు కళకళ









**ఆదిలాబాద్, మహా:** అందమైన రంగవల్లుల కోసం రంగురంగుల ముగ్గు పిండి, ఆకాశం వైపు దూసుకెళ్లే పతంగులు, నోరూరించే పిండివంటలు ఇలా ఎటు చూసినా మార్కెట్‌లో సంక్రాంతి పండుగ సంబరం కనిపిస్తోంది. భారతీయ సంస్కృతిలో పండుగలకు ఎంతో విశిష్టత ఉంది. ప్రతీ పండుగ ప్రకృతితో మమేకమవుతూ శాస్త్రీయతతో ముడిపడి ఉంటుంది. పల్లెలన్నీ సిరిధాన్యాలతో తులతూగుతూ పశు పక్ష్యాదులతో కళకళలాడుతుంటే మూడు రోజులపాటు ఊరువాడా కలిసి జరుపుకునే పసందైన వేడుక సంక్రాంతి. మహిళలు, యువతలు, చిన్నారులు, యువకులు అందరిలో నూతనోత్సాహాన్ని నింపే పండుగైన సంక్రాంతిని ఘనంగా జరుపుకునేందుకు జిల్లా వాసులు సంసిద్ధమవుతున్నారు. ఉద్యోగాల కోసం సుదూర ప్రాంతాల్లో ఉండే కుటుంబ సభ్యులు, బంధు మిత్రులంతా స్వస్థలాలకు రావడంతో ఎటు చూసినా కోలాహల వాతావరణం నెలకొంది. అటు



గ్రామాలలో దూడూ బసవన్నల ఆటలు హరిదాసులు పాటలతో పండగ కళ కనిపిస్తుంది. ఇక పతంగులతో పిల్లల రేరింతలు మామూలుగా ఉండదు. మరోవైపు సంక్రాంతి అనగానే గుర్తుకువచ్చే పిండి వంటల తయారీలో మహిళలు నిమగ్నమయ్యారు. నోరూరించే సకినాలు, మురుకులు, అరిసెలు, నువ్వులు, బెల్లంతో తయారు చేసే లడ్డూల తయారీకి మహిళలు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పండుగ నేపథ్యంలో పిండి గిర్నీలకు గిరాకీ భారీగా పెరిగింది. గిర్నీల వద్ద పిండి పట్టించేందుకు బియ్యం బ్యాగులతో బారులు తీరారు. ఉదయం నుండే రోడ్లన్నీ రద్దీగా కనిపిస్తున్నాయి. మరోవైపు పండుగ కోసం రకరకాల ఆహార పదార్థాలను తయారు చేసుకోలేని వారు ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన రెడీమెడ్ దుకాణాల సేవలను వినియోగించుకుంటున్నారు. పిండి వంటల కోసమే ప్రత్యేకంగా పలు దుకాణాలు అందుబాటులోకి రాగా... అందులోనూ గిరాకీ కనిపిస్తోంది. సంక్రాంతి పూట ఆచారంగా వస్తున్న పిండి వంటలను రుచి చూడాలనుకునే వారు ఆయా దుకాణాల వద్ద ఆర్డర్లు ఇస్తుండడంతో దుకాణాల్లో పనిచేసే సిబ్బంది పిండి వంటకాల తయారీలో బిజీబిజీగా గడుపుతున్నారు. మూడురోజులపాటు ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో గడుపుతూ పండగను ఘనంగా జరుపుకునేలా ఏర్పాట్లు చేసుకుంటుండడంతో ఎటు చూసినా సంక్రాంతి శోభ కనిపిస్తోంది.




## ఘనంగా కివి పబ్లిక్ స్కూల్‌లో ముగ్గుల పోటీలు

**వరంగల్, మహా:** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కరీమాబాద్ లోని కివి పాఠశాల యందు ముగ్గుల పోటీలతో పాటు కైట్ ఫెస్టివల్ ను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అద్భుతమైన ముగ్గులతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దాసి సతీష్‌మూర్తి, వైస్ ప్రిన్సిపల్ అన్నదేవర ప్రవీణ్ కుమార్, పాఠశాల డైరెక్టర్ దాసిరజని, విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపక బృందంతోపాటు జేసీఐ వరంగల్ కాకతీయ అధ్యక్షులు గుండం మహేందర్, కోశాధికారి వాసం, సోమేశ్వర పాల్గొన్నారు.

## వైభవంగా మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు

**పాల్గొన్న గ్రేటర్ వరంగల్ మేయర్, ఎమ్మెల్యే**



**వరంగల్, మహా:** ఐనవోలు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నగర మేయర్ గుండు సుధారాణి దంపతులు గుండు సుధారాణి ప్రభాకర్ దంపతులతోపాటు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రెడ్డి ఆలయానికి చేరుకుని, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ప్రజాప్రతినిధులకు ఆలయ సంప్రదాయాల ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించి, స్వామివారి శేష వస్త్రాలను ఆలయ అధికారులు బహూకరించారు. టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ దంపతులు, తదితరులు కూడా మల్లన్న స్వామిని దర్శించుకున్నారు.



## ఎల్బీనగర్‌లో సంక్రాంతి సందడి

**ఎల్బీ నగర్, మహా:** సంక్రాంతి సంబరాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఎల్బీ నగర్ మన్సూరాబాద్ లో కాలనీవాసులు సోమవారం ఉదయం భోగి మంటలు వేశారు. ఆ తర్వాత చిన్నారులకు భోగి పళ్ళు పోసి వారిని ఆశీర్వదించారు. ఆ తరువాత చిన్నారులు పతంగులు ఎగురవేశారు. దీంతో కాలనీలో సందడి వాతావణరం నెలకొన్నది. ఈ సంబరాల్లో చెంగల్ రేణుక, రాణి, రజిత, చంద్రకళ, కావలి అశ్విని, పూజిత, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.



## జీటీఏ డైరీని ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ

**వరంగల్, మహా:** జీటీఏ డైరీని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం అయిన జీటీఏ బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా వారికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ దుర్గం రవి, వరంగల్ జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి ప్రకాష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా వైదిక ఆరుద్రోత్సవ వేడుకలు

**పాల్గొన్న ఆలయం ట్రస్టీ, కార్పొరేటర్ దంపతులు**



**వరంగల్, మహా:** పుష్య మాసం పౌర్ణమి ఆరుద్రోత్సవాన్ని పురస్కరించుకొని కాశీ విశ్వేశ్వరాలయం ఆకారపు వారి ఆలయంలో సోమవారం స్వామివారికి ఉదయం నాలుగు గంటలకు నవరసాభిషేకం, భక్తులచే రుద్రాభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుడు లంకా శివకుమార్ ఉదయం 6 గంటలకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసి పంచ హారతులు సమర్పించారు. మొదటగా కాశీ విశ్వేశ్వర ఆలయం ట్రస్టీ ఆకారపు హరీష్ స్వాతిదంపతులు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకంతోపాటు వైదిక ఆరుద్రోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం ద్వారా ప్రముఖులు, భక్తులు దర్శనం చేసుకున్నారు. విచ్చేసిన భక్తులు హరహర మహాదేవ శంభో శంకర నినాదాలతో ప్రాంతమంతా దద్దరిల్లింది. పూజల అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో 28వ డివిజన్ కార్పొరేటర్ గందె నవీన్ కల్పన, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్ తోపాటు సంతోష్ కుమార్, ప్రవీణ్ కుమార్, అభిషేక్ కార్తీక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు రాగా ఈవో ఈ కిషన్ రావు తోపాటు ఆలయ సిబ్బంది వీరన్న, లక్ష్మీ, సాగర్ వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.



## కంది శ్రీనివాసరెడ్డి ఇంట సంక్రాంతి సందడి

**ఆదిలాబాద్, మహా:** కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఇంట సంక్రాంతి సందడి మొదలైంది. భోగి పండుగని పురస్కరించుకుని సోమవారం ఆయన కుటుంబ సభ్యులు, వారి పిల్లాపాపలతో ఆనందంగా గడిపారు. కంది శ్రీనివాస రెడ్డి తన సతీమణి కంది మౌనా శ్రీనివాసరెడ్డితో కలిసి తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. తమ పిల్లలకు భోగి పళ్లు పోసి వారిని ఆశీర్వదించారు. భోగభాగ్యాలు, సిరి సంపదలతో వర్ధిల్లాలని దీవించారు.



## నేత్ర పర్వంగా గోదాదేవి కళ్యాణం

**నిర్మల్, మహా:** జిల్లా కేంద్రంలోని మల్లన్నగుట్ట హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీ గోదాదేవి కళ్యాణం సోమవారం నేత్రపర్వంగా నిర్వహించారు. అర్చకులు రామన్ కన్నన్ కళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా కన్నుల పండువగా జరిపించారు. ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోద, మురళీధర్ రెడ్డి అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణం తిలకించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ గురుస్వామి నవయుగ మూర్తి, కోశాధికారి వేణుగోపాల్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పతంగుల పండుగ

**పాల్గొన్న నగర మేయర్, పశ్చిమ ఎమ్మెల్యే**



**హనుమకొండ, మహా:** నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కైట్ ఫెస్టివల్ ను స్థానిక వరంగల్ (పశ్చిమ) శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా పతంగులు (కైట్స్)ను ఎగురవేసి సందడి చేశారు. అనంతరం నగర ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు మానస రాంప్రసాద్, విజయ శ్రీ, రజాలే తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభా పురస్కారానికి

**డా. శ్రీనివాస్ వాసుదేవ్ ఎంపిక**




**ఎల్బీనగర్, మహా:** తెలుగు భాష, తెలుగు సంస్కృతి, తెలుగు వైభవం, తెలుగు సాహిత్యం, తెలుగు కళల పరిరక్షణ కోసం నిరంతరాయంగా సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలతో తనవంతు కృషి చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్ వాసుదేవ్ తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో అందజేస్తున్న తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి శ్రీనివాస్ వాసుదేవ్ ఎంపికయ్యారు. విజయవాడలోని కౌత పూర్ణానంద్ విలాస్ కళావేదికలో ఈ నెల 21న నిర్వహించనున్న కార్యక్రమంలో "తెలుగు కీర్తి" జాతీయ ప్రతిభా పురస్కారాన్ని శ్రీనివాస్ వాసుదేవ్ కు అందజేయనున్నారు. శ్రీనివాస్ ఆంగ్ల భాషలో డాక్టరేట్ అందుకోవడమే కాకుండా తెలుగు సాహిత్యంపై తన రచనలతో జీవన సాఫల్య పురస్కారం, వివిధ సంస్థల నుంచి పలు రకాల అవార్డులను పొందారు. అవార్డుకి ఎంపిక చేసిన కళా వేదిక సంస్థ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ కు శ్రీనివాస్ థ్యాంక్స్ చెప్పారు.



# నాలుగు నెలల కనిష్టానికి డిసెంబర్ రిటైల్ ద్రవ్యోల్బణం..!

ఆహార వస్తువుల ధరలు తగ్గడంతో డిసెంబర్ నెల రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు నెలల కనిష్టానికి దిగి వచ్చింది. నవంబర్‌లో 5.48 శాతంగా నమోదైన రిటైల్ ద్రవ్యోల్బణం.. డిసెంబర్ నెలలో 5.22 శాతానికి దిగి వచ్చింది. అక్టోబర్‌లో 6.21 శాతంతో 14నెలల గరిష్ట స్థాయికి చేరుకున్న రిటైల్ ద్రవ్యోల్బణం.. నవంబర్‌లో పతనమైంది. డిసెంబర్ రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్బీఐ అంచనాలకు అనుగుణంగా 26 శాతం మధ్యకు దిగి వచ్చింది. కూరగాయలు, పప్పు ధాన్యాలు, చెక్కెర, తృణ ధాన్యాల ధరలు తగ్గడం వల్లే డిసెంబర్ ఆహార ద్రవ్యోల్బణం గణనీయంగా దిగి వచ్చింది. కన్‌ఫెక్షనరీ, పర్సనల్ కేర్ ధరలు దిగి వచ్చాయి. గ్రామీణ ద్రవోల్బనం 5.76 శాతంగా ఉంటే, పట్టణ ద్రవ్యోల్బణం 4.58 శాతంగా రికార్డైంది.


# కొనుగోలుదారులకు పసిడి షాక్..! హైదరాబాద్‌లో తులం ధర ఎంతంటే..?

పసిడి ధరలు కొనుగోలుదారులకు షాక్ ఇస్తున్నాయి. వరుసగా ఐదో సెషన్‌లో ధరలు పెరిగాయి. సోమవారం మార్కెట్‌లో 24 క్యారెట్స్ గోల్డ్ రూ.100 పెరిగి.. తులానికి రూ.80,660కి చేరింది. గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో బంగారం ధర రూ.1,660 వరకు వరకు పెరిగింది. ముడి చమురు ధరల పెరుగుదల నేపథ్యంలో రూపాయి బలహీనపడింది. దాంతో బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ రష్యాపై విధించి కొత్త ఆంక్షల కారణంగా ముడి చమురు ధరలు పెరిగాయి. దాంతో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మరోసారి పెరిగాయి. అలాగే, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించిన నేపథ్యంలో చాలామంది మంది బంగారంపై పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నారు. దీనికి తోడు వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేస్తుండడంతో బంగారం ధర విపరీతంగా పెరుగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.73,550కి చేరింది. 24 క్యారెట్ల పసిడి రూ.80,220 మార్క్‌ని దాటింది. చెన్నైలో 22 క్యారెట్స్ పసిడి రూ.73,400 ఉండగా.. 24 క్యారెట్స్ బంగారం రూ.80,070కి చేరింది. ఇక హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం రూ.73,400 ఉండగా.. 24 క్యారెట్ల స్వర్ణం రూ.80,070కి పెరిగింది. ఇక వెండి ధర సైతం భారీగా పెరిగింది. రూ.వెయ్యి పెరిగి.. కిలోకు రూ.1.02లక్షలు పలుకుతున్నది.



## ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 16శాతం వృద్ధి..

### రూ.16.90 లక్షల కోట్లకు చేరిన టాక్స్..!




ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 15.88 శాతం వృద్ధి చెందాయి. 2024 ఏప్రిల్ నుంచి ఈ నెల 12వ తేదీ వరకూ సుమారు రూ.16.90 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్నులు వసూలయ్యాయని కేంద్ర ప్రభుత్వం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. నాన్ కార్పొరేట్ పన్నులు.. ప్రధానంగా వ్యక్తిగత ఆదాయం పన్ను రూ.8.74లక్షల కోట్ల పై చిలుకు వసూలైందని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) తెలిపింది. గతేడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ నెల 12వరకూ నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు సుమారు రూ.7.68లక్షల కోట్లు అని వెల్లడించింది. నెట్ సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్స్ టాక్స్ (ఎస్‌టీటీ) రూపేణా రూ.44,538 కోట్లు వసూలైందని సీబీడీటీ తెలిపింది. ఇదే కాలంలో టాక్స్ రీఫండ్స్ 42.49 శాతం వృద్ధితో రూ.3.74లక్షల కోట్లకు చేరుకున్నాయి. గతేడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈనెల 12 వరకూ స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు 20 శాతం వృద్ధితో రూ.20.64 లక్షల కోట్లకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.22.07లక్షల కోట్లు ఉంటాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ అంచనాల్లో పేర్కొన్నారు. ఇందులో కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.10.24లక్షల కోట్లు, వ్యక్తిగత ఆదాయం పన్ను, ఇతర పన్ను వసూళ్లు రూ.11.87 లక్షల కోట్లు ఉంటాయని కేంద్రం అంచనా వేసింది.


## హెచ్-1బీ వీసాలపై ఆధార పడం..

### తేల్చేసిన హెచ్‌సీఎల్ టెక్..!




హెచ్ 1బీ వీసాపై ప్రముఖ ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కీలక వ్యాఖ్యలు చేసింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికవ్వడంతో భారత ఐటీ కంపెనీలకు హెచ్ 1బీ వీసాల జారీపై ప్రభావం పడుతుందని తెలుస్తోంది. దీనిపై హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చీఫ్ పీపుల్స్ ఆఫీసర్ రామచంద్రన్ సుందరరాజన్ స్పందిస్తూ.. తమ సంస్థ హెచ్ 1బీ వీసాలపై ఆధారపడి పని చేయబోదని సోమవారం మీడియాకు చెప్పారు. ట్రంప్ హయాంలో ఐటీ బిజినెస్ మీద ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. 'అమెరికాలో పని చేస్తున్న మా ఉద్యోగుల్లో దాదాపు 80శాతం స్థానికులే. ఐటీ పరిశ్రమలో హెచ్ 1 బీ వీసాపై మా కంపెనీ ఆధారపడటం తక్కువ. ఇది ఇప్పుడు కొత్తేమీ కాదు. నాలుగేండ్ల క్రితం ఇదే పరిస్థితి ఎదురైంది. మేం ఉద్యోగుల నియామకాల్లో స్థానికులకు ప్రాధాన్యం ఇస్తూ స్వావలంభన సాధించాం'అని రామచంద్రన్ సుందర రాజన్ చెప్పారు. ప్రతియేటా తమ సంస్థకు జారీ చేస్తున్న హెచ్ 1బీ వీసా (H1 B Visa)ల సంఖ్య దీన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ప్రతియేటా తమ సంస్థకు జారీ అయ్యే హెచ్ 1బీ వీసా (H1 B Visa)లు 5001000 మధ్యే ఉంటాయన్నారు. సోమవారం ప్రకటించిన మూడో త్రైమాసికం ఆర్థిక ఫలితాల్లో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ రూ.4,591కోట్ల నికర లాభం గడించింది.


## నాలుగు రోజుల్లో రూ.24.69 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద హుష్‌కాకి..!




దేశీయ స్టాక్ మార్కెట్లు నాలుగు రోజులుగా 'బేర్'మంటున్నాయి. నాలుగు సెషన్లలో ఇన్వెస్టర్లు రూ.24.69 లక్షల కోట్ల సంపద కోల్పోయారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల పెరుగుదల, నిరంతరం విదేశీ నిధుల ఉపసంహారణతో పాటు ఉద్యోగాల కల్పన మెరుగుదలతో యూఎస్ ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీరేట్లు తగ్గింపు అవకాశాలు సన్నగిల్లాయి. మరోవైపు, ఫారెక్స్ మార్కెట్‌లో అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ గత రెండేండ్లలో తొలిసారి జీవిత కాల కనిష్టానికి పతనమైంది. ఫలితంగా ఇన్వెస్టర్లలో సెంటిమెంట్ బలహీన పడింది. దీంతో బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ గత శుక్రవారం.. 1048.90 పాయింట్ల నష్టంతో 76,330.01 పాయింట్ల వద్ద ముగిసింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.24,69,243.3కోట్లు కోల్పోయి రూ.4,17,05,906.74 కోట్ల వద్ద నిలిచింది. అంతే కాదు శుక్రవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ 4.82 లక్షల కోట్ల డాలర్ల దిగువకు పతనమైంది. సోమవారం ఇన్వెస్టర్లు రూ.12.61 లక్షల కోట్లు కోల్పోయారు. సెగెటివ్ సెంటిమెంట్ నేపథ్యంలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు ఈ నెలలో రూ.20 వేల కోట్ల విలువ గల పెట్టుబడులు ఉపసంహారించుకున్నారు. రష్యా ముడి చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ 1.43 శాతం పుంజుకుని 80.90 డాలర్ల వద్ద ట్రేడయింది. బీఎస్ఈలో 3562 షేర్లు నష్టపోగా, 555 స్టాక్స్ లాభ పడ్డాయి. మరో 131 స్టాక్స్ యథాతథంగా కొనసాగాయి.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



## ప్రపంచ రికార్డును తిరగరాసిన తెలంగాణ వ్యక్తి

### సుత్తితో 22 మేకులను ముక్కులోకి పంపిన క్రాంతి

వీడియో షేర్ చేసిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స

భారీగా వైరలవుతున్న వీడియో



**ఢిల్లీ:** తెలంగాణకు చెందిన ఓ వ్యక్తి ప్రపంచ రికార్డును తిరగరాశాడు. డ్రిల్ మ్యాన్‌గా పేరు పొందిన క్రాంతి కుమార్ పణికెర 2024లో ఇటలీలో జరిగిన లో షో డే రికార్డులో తన ప్రదర్శనతో అందరినీ విభ్రాంతికి గురి చేశాడు. ఒక్క నిమిషంలో ఒక దాని వెంట మరొకటి చొప్పున మొత్తం 22 మేకులను సుత్తితో ముక్కులోకి కొట్టి పంపించి క్రాంతి ప్రపంచ రికార్డును సాధించాడు. ఇందుకు సంబంధించిన వీడియోను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్(జీడబ్ల్యూఆర్) సోషల్ మీడియాలో షేర్ చేసింది.

గతంలో కెనడాకు చెందిన బర్నబీ క్యూ ఆర్బాక్స్ అనే వ్యక్తి 2015లో బస్కర్స్‌లో జరిగిన బే ఫెస్టివల్‌లో 30 సెకండ్లలో 15 మేకులను ముక్కులోకి పంపి ప్రపంచ రికార్డును సాధించాడు. అయితే, క్రాంతి కుమార్ గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించడం ఇది మొదటిసారి కాదు. గతంలో ఆయన నాలుకతో 57 విద్యుత్తు ఫ్యాను బ్లేడ్లను కూడా ఆపి గిన్నిస్ రికార్డ్ సాధించారు. అంతేగాక కత్తి నోట ఉంచుకుని దానితోతో 1944 కిలోల వాహనాన్ని లాగడం, ఒక నిమిషంలో 17 వస్తువులను సలసల మరుగుతున్న వేడి నూనెలో నుంచి ఉత్తి చేతులతో బయటకు తీయడం వంటి విన్యాసాలతో ప్రపంచ రికార్డులను నెలకొల్పిన విషయం తెలిసిందే.

## మురికివాడల్లో ఇండ్లు నిర్మిస్తే పోటీ చేయను

### అమిత్ షాకు కేజ్రీవాల్ సవాల్

**ఢిల్లీ:** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీలో పార్టీల మధ్య రాజకీయ మాటల యుద్ధం కొనసాగుతుంది. విమర్శలు, ప్రతివిమర్శల పర్వం సాగుతుంది. ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు సవాల్ విసిరారు. ఢిల్లీ మురికివాడల్లో కూల్చివేతలకు సంబంధించిన కేసులన్నిటినీ ఉపసంహరించి, అక్కడి నుంచి నిరాశ్రయుడైన ప్రతి వ్యక్తికి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. అక్కడ ప్రతి వ్యక్తికి ఇంటిని నిర్మిస్తామని బీజేపీ నేతలు కోర్టులో అఫిడవిట్ దాఖలు చేస్తే, తాను శాసన సభ ఎన్నికల్లో పోటీ చేయబోనంటూ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే, వెంటనే మురికివాడలను కూల్చేయాలనుకుంటున్నదని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలను కేంద్ర మంత్రి, బీజేపీ నేత హర్‌దీప్ సింగ్ పురి ఖండించారు.



**ఎన్నికల కోసం ఆప్ నిధి సేకరణ**

ఢిల్లీ ఎన్నికల కోసం ఆప్ నిధి సేకరణను ప్రారంభించింది. కల్కాజీ నుంచి పోటీ చేస్తున్న సీఎం ఆతిశీ ఆదివారం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమ పార్టీ రాజకీయాలు నిజాయితీపై ఆధారపడ్డాయన్నారు. అందుకే ప్రజలు ఆప్ ను ఆదరిస్తున్నారని చెప్పారు.

## సోన్‌మార్గ్ టన్నెల్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ




**జమ్మూకాశ్మీర్:** ప్రధాని మోదీ సోమవారం జమ్ముకాశ్మీర్‌ను సందర్శించారు. తన పర్యటనలో భాగంగా సోన్‌మార్గ్ ప్రాంతంలో జడ్ మోడ్ సొరంగాన్ని ఆయన ప్రారంభించారు. ప్రధాని రాక నేపథ్యంలో జమ్ముకాశ్మీర్‌లో అధికారులు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. టన్నెల్ ప్రారంభోత్సవంలో జమ్ముకాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. శ్రీనగర్ నుంచి కార్గిల్ వెళ్లే దారిలో శ్రీనగర్‌లేహ్ జాతీయ రహదారిపై రూ. 2500 కోట్లు ఖర్చు చేసి ఈ టన్నెల్‌ను నిర్మించారు. భారత రక్షణ రంగానికి వ్యూహాత్మకంగా ఈ టన్నెల్ చాలా కీలకం కానున్నది. ఈ జడ్ మోడ్ సొరంగం 6.5 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. ఈ టన్నెల్ ద్వారా ఏ సీజన్‌లోనైనా లడఖ్‌కు చేరుకోవడానికి వీలవుతుంది. టన్నెల్‌కు సంబంధించి 2015లో ప్రారంభమైన నిర్మాణ పనులు గత ఏడాది పూర్తైన విషయం తెలిసిందే.

ఈ జెడ్ మోడ్ టన్నెల్ భారత్‌కు వ్యూహాత్మకంగా చాలా కీలకమైంది. దాదాపు సముద్రమట్టానికి 8,500 అడుగుల ఎత్తులో దీనిని నిర్మించారు. అత్యంత శీతలమైన లడఖ్‌ను ఏ సీజన్‌లో అయినా సందర్శించేందుకు ఈ టన్నెల్ ఉపయోగపడనున్నది. ఈ సొరంగం రవాణా వ్యవస్థతోపాటు రక్షణ వ్యవస్థకు కూడా కీలకం కానున్నది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సోనామార్గ్ పట్టణానికి టన్నెల్ ద్వారా వెళ్లొచ్చు. జమ్ముకాశ్మీర్‌లో 'జడ్ మోడ్' టన్నెల్ ఏర్పాటుతో కార్గిల్ మరింత సురక్షితంగా మారింది.



## పేలిన మావోయిస్టులు అమర్చిన ఐఈడీ

### బాలికకు తీవ్ర గాయాలు

### గాలింపు ముమ్మరం చేసిన పోలీసులు

**ఛత్తీస్‌గఢ్ :** సుక్మా జిల్లాలో చింతల్నార్ పోలీసు స్టేషన్ పరిధిలోని తిమ్మాపురం గ్రామ శివార్లలో మావోయిస్టులు ఐఈడీ బాంబును అమర్చారు. అయితే ఆదివారం సాయంత్రం ఆ రహదారి గుండా ఓ బాలిక నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో ఐఈడీ పేలిపోయింది. దీంతో బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీంతో అక్కడ పోలీసులు కూంబింగ్ ముమ్మరం చేశారు. మావోయిస్టుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఈ నెల 6న బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు ఐఈడీ పేల్చడంతో 8 మంది పోలీసులు, ఒక డ్రైవర్ ప్రాణాలు కోల్పోయారు.

## భారత్‌లో పెరుగుతున్న హెచ్‌ఎంపీవీ కేసులు




**ఢిల్లీ:** భారత్‌లో హ్యూమన్ మెటాప్ న్యూమో (హెచ్‌ఎంపీవీ) వైరస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా మరోచిన్నారికి ఈ వైరస్ సోకింది. పుదుచ్చేరికి చెందిన చిన్నారికి హెచ్‌ఎమ్‌పీవీ వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు వైద్యులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఆరోగ్య శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. సదరు చిన్నారి జ్వరం, దగ్గు, జలుబుతో ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో చేరినట్లు వెల్లడించింది. ప్రస్తుతం చిన్నారి వైద్య చికిత్సకు సహకరిస్తోందని తెలిపింది. అయితే, తాజా కేసుతో పుదుచ్చేరిలో హెచ్‌ఎమ్‌పీవీ కేసులు రెండుకు చేరాయి. గతవారం మూడేండ్ల చిన్నారి ఈ వైరస్ బారినపడిన విషయం తెలిసిందే. చికిత్స తరువాత పూర్తిగా కోలుకొని డిశ్చార్జ్ అయ్యింది. తాజా కేసుతో కలిపి భారత్ లో ఇప్పటివరకు హెచ్‌ఎమ్‌పీవీ కేసులు 18కి చేరాయి.

## కుంభమేళాకు స్టీవ్‌జాబ్స్ సతీమణి లారెన్

### స్వాగతం పలికిన స్వామీజీలు



**యూపీ:** ప్రయాగ్ రాజ్ లో కొనసాగుతున్న కుంభమేళాకు భారతదేశం నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి కూడా ప్రముఖులు హాజరవుతున్నారు. తాజాగా ఆపిల్ సహ వ్యవస్థాపకులు దివంగత స్టీవ్ జాబ్స్ భార్య, ప్రపంచంలో అత్యంత ధనవంతురాలైన మహిళల్లో ఒకరైన లారెన్ పావెల్ మహా కుంభమేళాకు హాజరయ్యారు. 40 మంది సభ్యులతో కూడిన బృందంతో ఆమె ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు తరలివచ్చారు. ప్రయాగ్‌రాజ్‌కు వచ్చిన ఆమెకు శిబిరం వద్ద స్వామీజీలు ఘనంగా స్వాగతం పలికారు. లేత పసుపు వర్ణంలో వస్త్రాలు ధరినంచిన లారెన్.. చేతికి రక్షా సూత్ర, మెడలో రుద్రాక్ష మాల ధరించి ఉన్నారు. ప్రయాగ్‌రాజ్ రావడానికి ముందు వారణాసిలోని కాశి విశ్వనాథ ఆలయాన్ని సందర్శించారు.



# గేమ్ ఛేంజర్ చిత్ర యూనిట్‌కు బెదిరింపులు

## సైబర్ క్రైం స్టేషన్ లో ఫిర్యాదు

### కేసు నమోదు చేసిన పోలీసులు

**హైదరాబాద్, మహా :** గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ మూవీ జనవరి 10న ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. సినిమా విడుదలైన రోజే సోషల్ మీడియాలో ప్రత్యక్షమవ్వడం గమనార్హం. అయితే గేమ్ ఛేంజర్ చిత్ర యూనిట్ కి బెదిరింపులకు కూడా పాల్పడినట్టు సమాచారం. ఈ సినిమా ప్రైవేటు బస్సుల్లో ప్రదర్శన చేశారు. ఈ విషయం చిత్ర నిర్మాతకు తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాస్తవానికి గేమ్ ఛేంజర్ ప్రింట్ ఆన్ లైన్ లో లీక్ కావడం వెనుక 45 మందితో కూడిన బృందం ఉందంటూ మూవీ యూనిట్ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వీళ్లే తమ సినిమా పై సోషల్ మీడియాలో నెగిటివ్ ప్రచారం చేసారని పేర్కొంది. తాము అడిగినంత డబ్బు ఇవ్వకపోతే లీక్ చేస్తామంటూ విడుదలకు 2 రోజుల ముందే చిత్ర బృందంలోని కీలక వ్యక్తులను బెదిరించినట్టు ఆధారాలను సమర్పించింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును ప్రారంభించారు.




# ఇంట్రడక్షన్ కోసం భారీ ఏర్పాట్లు

విజయ్ దేవరకొండ 'ట్యాక్సీవాలా' సినిమాతో దర్శకుడిగా పరిచయం అయ్యారు రాహుల్ సంకృత్యాన్. ఆ సినిమా బాగా ఆడటంతో రెండో అవకాశం హీరో నాని రూపంలో తలుపు తట్టింది. అదే 'శ్యామ్ సింగరాయ్'. ఆ సినిమా కూడా మంచి హిట్. ఇప్పుడు ముచ్చటగా మూడో సినిమాను తన తొలి హీరో విజయ్ దేవరకొండతో చేస్తున్నాడు రాహుల్ సంకృత్యాన్. మైత్రీమూవీమేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం 1854-78 మధ్య కాలంలో జరిగే కథ అని తెలుస్తున్నది. ఇందులో హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ కీలక పాత్ర పోషిస్తున్నట్టు వార్తలు కూడా వస్తున్నాయి. ఇదిలావుంటే ఈ సినిమా షూటింగ్ ఈ నెల చివరి వారం నుంచి మొదలు కానున్నట్టు విశ్వసనీయ సమాచారం. తొలి షెడ్యూల్‌లో విజయ్ దేవరకొండ ఎంట్రీ సీన్స్ తీస్తారట. దీనికోసం ప్రత్యేకంగా సెట్‌ను కూడా వేస్తున్నట్టు తెలుస్తున్నది. సినిమా మొత్తానికి ఈ సీన్ హైలైట్‌గా నిలుస్తుందని చెబుతున్నారు. ఇందులో విజయ్ సరికొత్త గెటప్‌లో కనిపిస్తారట. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

# లేగదూడతో ధనుష్..

## ట్రెండింగ్‌లో ఇడ్లీకడై పొంగళ్ పోస్టర్లు

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నాడని తెలిసిందే. వీటిలో ఒకటి ధనుష్ స్వీయ దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న చిత్రం ఇడ్లీ కడై. DD4గా వస్తోన్న ఈ చిత్రాన్ని ఆకాశ్ (డెబ్యూ) తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటికే లాంచ్ చేసిన ప్రీ లుక్, ఫస్ట్ లుక్ పోస్టర్లు ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా పొంగళ్ కానుకగా స్పెషల్ పోస్టర్లను విడుదల చేశారు. ఒక పోస్టర్‌లో ధనుష్, నిత్యమీనన్ చేనులో నిలబడి వర్షంలో తడిసి ముద్దవుతుండగా.. మరో పోస్టర్‌లో తెలుపు రంగు చొక్కా, లుంగీలో మర్రి చెట్టు కింద లేగదూడను పట్టుకొని కూర్చున్నాడు. ఈ రెండు సినిమాలు సినిమా ఎలా ఉండబోతుందో హింట్ ఇచ్చేస్తూ క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. తిరు సినిమా తర్వాత ఈ ఇద్దరి కాంబోలో వస్తున్న ప్రాజెక్టు కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ మూవీలో అరుణ్ విజయ్, సత్యరాజ్, అశోక్ సెల్వన్, రాజ్‌కిరణ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ధనుష్ దీంతోపాటు శేఖర్ కమ్ముల డైరెక్షన్‌లో కుబేరలో నటిస్తుండగా.. షూటింగ్ దశలో ఉంది. ధనుష్ మరోవైపు హిందీలో రాంజానా, అట్రాంగి రే తర్వాత ఆనంద్ ఎల్ రాయ్ డైరెక్షన్‌లో తేరే ఇష్క్ మే సినిమాను కూడా చేస్తున్నాడని తెలిసిందే.



# హార్దిక్ పాండ్యాతో జాన్వీ కపూర్ డేటింగ్..?

## నిజమేంటంటే..?

క్రికెటర్ హార్దిక్ పాండ్యా, స్టార్ నటి జాన్వీ కపూర్ డేటింగ్‌లో ఉన్నారంటూ సోషల్ మీడియాలో తెగ ప్రచారం జరుగుతోంది. అందుకు కారణం ఇద్దరూ చనువుగా ఉన్న ఫొటోలు వైరల్ కావడమే. వీరిద్దరూ కలిసి ఇటీవలే మాల్దీవుల్లో విహరించినట్లు ఆ ఫొటోలను బట్టి తెలుస్తోంది. జాన్వీపాండ్యా సముద్ర తీరంలో విహరిస్తూ, సన్నిహితంగా కనిపించారు. ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు హార్దిక్ – జాన్వీ పీకల్లోతు ప్రేమలో ఉన్నారంటూ మాట్లాడుకోవడం మొదలు పెట్టారు. దీంతో రంగంలోకి దిగిన నేషనల్ మీడియా ఫ్యాక్ట్ చెక్ నిర్వహించగా అసలు విషయం బయటపడింది. ఈ ఫొటోలు నిజం కాదని తేల్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో క్రియేట్ చేసినవిగా తేల్చింది. దీంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ వచ్చిన వార్తలు కేవలం పుకార్లు మాత్రమే అని స్పష్టమైంది.కాగా, హార్దిక్ పాండ్యా ఇటీవలే తన భార్య నటాషా స్టాంకోవిక్‌తో విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం తన దృష్టిమొత్తం కెరీర్‌పైనే పెట్టాడు. ఇక జాన్వీ కపూర్ వరుస బాలీవుడ్ ప్రాజెక్టులతోపాటు టాలీవుడ్ సినిమాలతో బిజీగా మారిపోయింది.



# క్రీడా వార్తలు | SPORTS NEWS



# విరాట్ కోహ్లీ వల్లే అంబటి రాయుడి కెరీర్ నాశనం..!

## రాబిన్ ఊతప్ప సంచలన వ్యాఖ్యలు..!

టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీపై మాజీ ఆటగాడు రాబిన్ ఊతప్ప సంచలన వ్యాఖ్యలు చేశాడు. 2019 వరల్డ్ కప్ జట్టులో తెలుగు క్రికెటర్ అంబటి రాయుడుకు అవకాశం దక్కకపోవడానికి విరాట్ కోహ్లీయే కారణమని ఆరోపించాడు. అతని కెరియర్ నాశనం అవడానికి కారణం విరాట్ కారణమని వ్యాఖ్యానించాడు. రాయుడు అంటే కోహ్లీకి నచ్చదని.. అందుకే 2019 వన్డే ప్రపంచకప్ జట్టు నుంచి చివరి నిమిషంలో తప్పించినట్లుగా ఊతప్ప తెలిపాడు. ఆ వరల్డ్ కప్ జట్టులో రాయుడికి ఎంపికయ్యే అవకాశాలు చాలా ఎక్కువగానే ఉన్నాయి. అయితే, జట్టును ప్రకటించిన సమయంలో పేరు మాత్రం కనిపించలేదు. దాంతో మనస్థాపానికి గురైన రాయుడు ఆ తర్వాత అంతర్జాతీయ క్రికెటర్ నుంచి గుడ్‌బై చెప్పాడు. అతని స్థానంలో ఆల్‌రౌండ్ విజయ్ శంకర్‌కు అవకాశం ఇచ్చింది. అతను బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్ చేయగల త్రీడీ ప్లేయర్ అంటూ అప్పటి చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ ప్రెస్‌మీట్‌లో పేర్కొన్నారు.

ఓ ఇంటర్వ్యూ రాబిత్ ఊతప్ప మాట్లాడుతూ.. విరాట్ కోహ్లీకి ఎవరైనా నచ్చకపోయినా అతన్ని పక్కన పెట్టేస్తాడని.. తనకు సరిగా అనిపించకపోయినా అవకాశాలు ఇవ్వడని.. అందుకు అంబటి రాయుడు ఉదాహరణ అని తెలిపాడు. ప్రతి ఆటగాడు ఈ స్థాయికి వచ్చేందుకు కష్టపడి పని చేస్తాడని.. అయితే, ప్రతి ఒక్కరికీ సొంత ప్రాధాన్యతలు ఉంటాయని.. వాటిని తాను సైతం అంగీకరిస్తానని.. కానీ, అవకాశాలు లేకుండా చేయడం ఏమాత్రం సరికాదని ఊతప్ప పేర్కొన్నాడు. రాయుడికి ప్రపంచకప్ జెర్సీలతో పాటు కిట్‌ను సైతం అందించారని.. అంతా సిద్ధమైపోయిన వేళ.. ఏ క్రికెటర్ అయినా ప్రపంచకప్‌లో ఆడుతామనే అనుకుంటారని.. కానీ, రాయుడిని ఎంపిక చేయకుండా కోహ్లీ అడ్డుకున్నాడని.. అదిమాత్రం తనకు ఏమాత్రం నచ్చలేదని ఊతప్ప చెప్పాడు.


అయితే, రాయుడిని ఇంటికి పంపి.. ముఖంపైనే జట్టులోకి రాకుండా తలుపులు మూసేయడం తప్పు, అన్యాయమని తెలిపాడు. ఇలాంటి నిర్ణయాలు మనస్తత్వాన్ని ప్రభావితం చేస్తాయని అర్థం చేసుకోవాలన్నాడు. నిర్ణయంతో ఒకరి విశ్వాసంపై దెబ్బతీశారని.. ఈ నిర్ణయం వెనుక ఉన్న ఆలోచన ఏంటీ? అంటూ ప్రశ్నించాడు. ఇక 2019 వన్డే ప్రపంచకప్ జట్టులో తనకు చోటు సెలక్షన్ కమిటీ వల్లే తనకు చోటు దక్కలేదని గతంలో అంబటి రాయుడు ఆరోపించాడు. ఎమ్మెస్కే ప్రసాద్ కారణంగా అన్యాయం జరిగిందని పేర్కొన్నాడు. అయితే, తనపై చేసిన ఆరోపణలను ఎమ్మెస్కే ఖండించాడు. రాయుడు తనను అపార్థం చేసుకున్నాడని.. సెలెక్టర్లతో పాటు కెప్టెన్ విరాట్ కోహ్లీ కూడా జట్టు ఎంపికలో కీలక పాత్ర పోషించాడని ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు.

# చాంపియన్స్ ట్రోఫీకి దక్షిణాఫ్రికా జట్టు ఎంపిక..

ఈ ఏడాది ఫిబ్రవరిలో జరుగనున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి దక్షిణాఫ్రికా జట్టును ప్రకటించింది. టెంబా బావుమా నాయకత్వంలో ఐసీసీ ఈవెంట్‌లో దక్షిణాఫ్రికాలోకి బరిలోకి దిగనున్నది. గాయాలతో జాతీయ జట్టుకు దూరమైన ఫాస్ట్ బౌలర్లు లుంగీ ఎంగిడీ, అన్రిచ్ అన్రిచ్ నోర్ట్జేను సైతం ఎంపిక చేసింది. జట్టుల్లో ఐదుగురు ఫాస్ట్ బౌలర్లు, ముగ్గురు స్పిన్నర్లకు అవకాశం ఇచ్చింది. బావుమా నాయకత్వంలో దక్షిణాఫ్రికా ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకుంది. ఈ క్రమంలో చాంపియన్స్ ట్రోఫీలోనూ టీమ్ కప్ నెగ్గాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తున్నది. చాంపియన్స్ ట్రోఫీలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, ఆఫ్ఘనిస్థాన్‌తో కలిసి గ్రూప్‌బీలో ఉంది.

**ఇద్దరు ఫాస్ట్ బౌలర్ల రీ ఎంట్రీ..**

గత నెలలో అన్రిచ్ కాలికి గాయమైంది. దాంతో పాక్‌తో జరిగిన వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. ఎన్గిడీ సైతం గాయం కారణంగా శ్రీలంక, పాకిస్థాన్‌తో జరిగిన వన్డే దూరమయ్యాడు. 2023 వన్డే ప్రపంచకప్‌లో సౌతాఫ్రికా సెమీఫైనల్‌కు చేరింది. ఆ సమయంలో జట్టు ప్రదర్శన అద్భుత ప్రదర్శన చేసింది. సెమీ ఫైనల్స్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఖంగు తిన్నది. ఆ టోర్నమెంట్‌లోనూ టెంబా బావుమా కెప్టెన్‌గా వ్యవహరించాడు. చాంపియన్స్ ట్రోఫీకి సైతం బావుమానే కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. ఫిబ్రవరి 19న చాంపియన్స్ ట్రోఫీ మొదలుకానున్నది. ప్రొటీస్ జట్టు తొలి మ్యాచ్‌ను 21న కరాచీలో ఆఫ్ఘనిస్థాన్‌తో తలపడుతుంది. ఆ తర్వాత 25న రావల్పిండిలో ఆస్ట్రేలియాతో, మార్చి 1న ఇంగ్లాండ్‌తో గ్రూప్ దశ మ్యాచ్‌లు ఆడుతుంది.



**జట్టులోకి ముగ్గురు స్పిన్నర్లు.. ఐదుగురు ఫాస్ట్ బౌలర్లు..**

ఉపఖండం పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని దక్షిణాఫ్రికా సెలెక్టర్లు ముగ్గురు స్పిన్నర్లతో పాటు ఐదుగురు ఫాస్ట్ బౌలర్లను ఎంపిక చేశారు. ఇటీవల గాయపడ్డ ఫాస్ట్ బౌలర్ నాండ్రే బర్గర్ జట్టులో అవకాశం ఇవ్వలేదు. దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు జట్టులో వీలైనంత ఎక్కువ మంది ఆల్ రౌండర్లను ప్రాధాన్యం ఇచ్చింది. ఈ క్రమంలోనే రీహాబిలిటేషన్‌లో ఉన్న వియాన్ ముల్డర్‌కు సైతం ఎంపిక చేసింది. శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో చేతికి గాయమైంది. ఇటీవల పాకిస్థాన్‌తో జరిగిన రెండో టెస్టుకు అందుబాటులోకి వచ్చాడు. తాజాగా ఫియోజియో గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో చాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేసింది. జట్టులో కేశవ్ మహారాజ్, తబ్రేజ్ షంసి రూపంలో ఇద్దరు స్పిన్నర్లను ఎంపిక చేయగా.. ఐడెన్ మార్క్‌రమ్ సహాయం చేయనున్నాడు. లుంగీ ఎన్గిడీ, అన్రిచ్ నోర్ట్జే, కసిగో రబాడా, ముల్డర్ ఫాస్ట్ బౌలర్ల కేటగిరిలో ఎంపిక చేసింది.


**ఛాంపియన్స్ ట్రోఫీకి దక్షిణాఫ్రికా జట్టు**

టెంబా బావుమా (కెప్టెన్), టోనీ డీ జోర్జీ, మార్కో జాన్సెన్, హెన్రిచ్ క్లాసెన్, కేశవ్ మహారాజ్, ఐడెన్ మార్క్‌రమ్, డేవిడ్ మిల్లర్, వియాన్ ముల్డర్, లుంగి ఎన్గిడీ, అన్రిచ్ నోర్ట్జే, కగిసో రబాడా, ర్యాన్ రికెల్టన్, తబ్రైజ్ షంసి, ట్రిస్టన్ స్టబ్స్, రాస్సీ వాన్ డెర్ డస్సెన్.

# టెస్ట్ ఫార్మాట్‌లో టీమిండియా గాడినపడడం సవాలే..

## బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా..

టెస్టుల్లో భారత జట్టు ఇబ్బందిపడుతోందని బీసీసీఐ కొత్త కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా అంగీకరించారు. రెడ్ బాల్ ఫార్మాట్‌లో జట్టు మళ్లీ గాడినపడడం ఓ సవాల్‌గా అని పేర్కొన్నారు. న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టుల్లో టీమిండియా ఘోరంగా ఓటమిపాలైంది. దాంతో ప్రపంచ టెస్ట్ చాంపియన్స్‌షిప్ ఫైనల్‌కు చేరుకోలేకపోయింది. ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో జరిగే సిరీస్, చాంపియన్స్ ట్రోఫీపై దృష్టి సారించామని.. బీసీసీఐ నిపుణులతో మాట్లాడి సానుకూల ఫలితాలు రాబట్టేందుకు ప్రయత్నిస్తుందని సైకియా పేర్కొన్నారు. భారత్ సిరీస్‌ల వారీగా ముందుకు వెళ్తుందని.. ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో జరిగి పరిమిత ఓవర్ల సిరీస్‌పై దృష్టి సారిస్తుందన్నారు. న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌ల్లో టీమిండియా బాగా రాణించలేదని అందరికీ తెలుసునని.. ఇదే పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. ప్రస్తుతం స్వదేశంలో ఇంగ్లాండ్‌తో సిరీస్ ఉంటుందని.. ఆ తర్వాత దుబాయి వేదికగా చాంపియన్స్ ట్రోఫీలో ఉడాల్సి ఉందని.. ఒకేసారి ఒక టోర్నమెంట్ గురించి మాత్రమే ఆలోచిస్తున్నామని తెలిపారు. గత రెండురోజుల్లో చాలా అంశాలపై చర్చించామని.. ఎదురైన ఎదురుదెబ్బల నుంచి కోలుకునేందుకు ప్రయత్నిస్తామన్నారు. చర్చల్లో సానుకూల ఫలితాల కోసం నిపుణుల అభిప్రాయాన్ని తీసుకుంటున్నామని చెప్పారు. ఐసీసీ అధ్యక్షుడు, మాజీ బీసీసీఐ కార్యదర్శి జై షా బాధ్యతలను తాను ముందుకు తీసుకెళ్లాలనుకుంటున్నానన్నారు. ఆదివారం జరిగిన బీసీసీఐ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో సైకియా కార్యదర్శిగా నియామకమయ్యారు. జై షా స్థానంలో సైకియా బాధ్యతలు చేపట్టారు. కార్యదర్శి పోస్టుకు నామినేషన్స్ ఆహ్వానించగా.. సైకియా ఒక్కరే దాఖలు చేశారు. దాంతో ఆయన ఏకగ్రీవమైంది. అలాగే ప్రభతేజ్ సింగ్ భాటియా కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఆశిష్ షెలార్ స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. షెలార్ మహారాష్ట్రలోని దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వంలో కేబినెట్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. దాంతో ఆయన బీసీసీఐలో పదవిని వదులుకున్నారు.



# రెండు తరాల క్రికెటర్ల మధ్య పోలిక సాధ్యం కాదు

## మాజీ కెప్టెన్ కపిల్ దేవ్

టీమిండియా రెండు తరాల క్రికెటర్లను పోల్చి చూడలేమని మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ అన్నారు. ఇంగ్లాండ్‌తో జరుగనున్న ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్‌ను పక్కన పెట్టిన విషయం తెలిసిందే. దీనిపై సైతం స్పందించేందుకు నిరాకరించారు. 199192లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో కపిల్ దాదాపు 300 ఓవర్లు బౌలింగ్ చేశాడు. టెస్ట్ ఫార్మాట్‌లో 400 వికెట్లు తీసిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టించారు. భారత స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా వెన్ను నొప్పి కారణంగా బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ వేదికగా జరిగిన టెస్టు సెకండ్ ఇన్నింగ్‌లో బౌలింగ్ చేయలేకపోయాడు. ఈ సిరీస్‌లో బుమ్రా 150 ఓవర్లకుపైగా 32 వికెట్లు పడగొట్టాడు. రెండు తరాల మధ్య పోలిక ఉండకూడదని.. దాంతో అవసరం లేదన్నారు. ప్రస్తుత కాలంలో ఆటగాళ్లు రోజునే 300 పరుగులు చేస్తున్నారని.. ఇది తమకాలంలో జరుగలేదని.. దాంతో రెండు తరాల ఆటగాళ్ల మధ్య పోలిక సాధ్యం కాదన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో పేలవ ఫామ్‌తో విమర్శల పాలవుతున్న కెప్టెన్ రోహిత్, విరాట్ కోహ్లీ భవితవ్యంపై ఊహాగానాలున్నాయి. ఇద్దరూ సీనియర్లని.. వారి భవిష్యత్‌ను వారే నిర్ణయించుకోగలరని మాజీ కెప్టెన్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో తొమ్మిది ఇన్నింగ్స్‌లో కోహ్లీ 190 పరుగులు చేయగలిగాడు. ఆఫ్ స్టంప్ ఆవల బంతిని వెంటాడుతూ పదేపదే క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. కెప్టెన్ రోహిత్ గణాంకాలు మరింత ఆందోళనకరంగా ఉన్నాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com